
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
మంగళవారం 8 ఏప్రిల్ 2025




విజయవాడ వెస్ట్ బైపాస్

జాప్యం!

ధాన్యం రవాణా బిల్లులు అందక రైతుల అవస్థలు

- ఒక్క కోలవెన్ను గ్రామంలోనే రూ.12.21 లక్షలు పెండింగ్
- త్వరగా ఇప్పించాలని కలెక్టర్ బాలాజీకి రైతుల వినతి
- జిల్లా వ్యాప్తంగా ఇంకా తేలని రవాణా బిల్లుల లెక్కలు
- నాలుగు నెలలుగా ఎదురుచూస్తున్న రైతులు

> జిల్లా రైతులకు కొత్త కష్టం వచ్చిపడింది. గత ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వ వాహనాలు అందుబాటులో లేకపోవడంతో రైతులే సొంత ఖర్చులు పెట్టుకుని ధాన్యం మిల్లులకు రవాణా చేశారు. ఆ రవాణా బిల్లులు ఇంతవరకు రైతుల ఖాతాల్లో జమకాలేదు. పౌరసరఫరాల సంస్థ అధికారులు, మిల్లర్లు ధాన్యం రవాణా ఖర్చుల లెక్కలు నేటికీ తేల్చక పోవడంతో బిల్లులు వస్తాయో.. రావో అనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కంకిపాడు మండలం కోలవెన్ను గ్రామానికి చెందిన రైతులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం అందించారు. ధాన్యం రవాణా బిల్లులను త్వరగా ఇప్పించాలని వేడుకున్నారు. ఒక్క కోలవెన్ను గ్రామంలోనే రూ.12.21 లక్షలకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.


కలెక్టరేట్ వద్ద కోలవెన్ను గ్రామ రైతులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కంకిపాడు మండలం కోలవెన్ను గ్రామానికి చెందిన 405 మంది రైతులు గతేడాది డిసెంబరు 15వ తేదీ నాటికి ధాన్యం విక్రయాలు పూర్తిచేశారు. వరి కోతల సమయంలో వర్షాలు వర్షాలు పడటంతో యంత్రాల ద్వారా కోతలు పూర్తి చేసి, స్థానికంగా ఉన్న మిల్లులతోపాటు జగ్గయ్యపేట, తదితర ప్రాంతాలకు ధాన్యం వాహనాల్లో తరలించారు. వాహనాలు అందుబాటులో లేకపోవడంతో రైతులే కిరాయికి లారీలు సమకూర్చుకుని, ఒక్కో లారీకి రూ.5,500 చొప్పున నగదు చెల్లించి మరీ వాహనాలకు అనుమతులు తీసుకున్నారు. మూడు కిలోమీటర్ల నుంచి 120 కిలోమీటర్ల దూరంలోని మిల్లులకు ధాన్యం రవాణా చేశారు. ఈ సమయంలో రైతులకు సంబంధించిన పేర్లు, వాహనాల నంబర్లు, వాహనాలు రైతులు సమకూర్చుకుంటే ఆ వివరాలు, ఎఫ్‌టీపీ నంబర్లను నమోదు చేసి ఎన్ని టన్నుల ధాన్యం రవాణా చేశారో జాబితాలు సిద్ధం చేశారు. ఈ ఒక్క గ్రామం నుంచే 2,988 టన్నుల ధాన్యం రవాణా చేశారు. ఇందు కోసం రూ.12.21 లక్షలు వరకు ఖర్చు అయినట్లు సమాచారం. కానీ నేటి వరకు రైతులకు ఇవ్వాల్సిన ధాన్యం రవాణా బిల్లులు ఇవ్వకుండా జాప్యం చేస్తూ వస్తున్నారు.

6 లక్షల టన్నుల వరకు ధాన్యం కొనుగోలు

గతేడాది నవంబరు 15వ తేదీ నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. 5.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం తొలివిడతగా అనుమతులు ఇచ్చింది. రెండు, మూడు విడతల్లో మరో 30 వేల టన్నుల చొప్పున ధాన్యం కొనుగోలు చేసేందుకు అనుమతులు వచ్చాయి. ఇప్పటి వరకు పౌరసరఫరాల సంస్థ ద్వారా సుమారు ఆరు లక్షల టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో మిగులుబాటుగా ఉన్న ధాన్యం 40 వేల టన్నులు, రబీ సీజన్ కోటాలో మరో 10వేల టన్నులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఇటీవల అనుమతులు ఇచ్చింది. సుమారు ఆరు లక్షల మిగతా 6లో..

టన్నుకు ఎంత ఇస్తారనే అంశంపై సందిగ్ధం

ధాన్యం విక్రయించిన సమయంలో ప్రభుత్వ వాహనాలు అందుబాటులో లేకపోవడంతో రైతులే సొంత ఖర్చులు పెట్టుకుని మరీ ధాన్యం ఆర్ఎస్‌కేలు సూచించిన మిల్లులకు రవాణా చేశారు. లారీలకు కిరాయిని రైతులే చెల్లించారు. 10 కిలోమీటర్ల లోపు దూరం ఉన్న మిల్లులకు రవాణా చేస్తే టన్నుకు రూ.350, అంతకు మించి దూరం తరలిస్తే అందుకు అనుగుణంగా బిల్లులను ఇస్తామని అప్పట్లో ప్రకటించారు. ఎంత దూరంలోని మిల్లుకు ధాన్యం పంపినా టన్నుకు రూ. 650లకు మించి చెల్లించబోమని అప్పట్లో అధికారులు రైతులకు తెలిపారు. డిసెంబరులో వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం త్వరితగతిన కొనుగోలు చేయాలని కోలవెన్ను రైతులు ఆందోళనకు దిగారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాలసంస్థ కమిషనర్, ఎండీలను ఈ గ్రామానికి పంపి ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేయించారు. ధాన్యం బిల్లులు రెండు రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో జమయ్యాయి. కానీ ధాన్యం రవాణా బిల్లులు మాత్రం పెండింగ్‌లోనే ఉంచారు. ఇంతకాలంగా ఈ బిల్లుల కోసం వేచి చూసిన రైతులు, మహిళా రైతులు కోలవెన్ను గ్రామ టీడీపీ అధ్యక్షుడు తుమ్మల జగదీష్‌తో కలసి మచిలీపట్నం వచ్చి ధాన్యం రవాణా బిల్లులను ఇప్పించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

నయా నగరి..!

- 10 నెలల్లో 100 పరిష్కారాలు
- మారుతున్న బెజవాడ.. అభివృద్ధికి అడుగుజాడ
- విమానాశ్రయంలో ఊపందుకున్న పనులు
- నగరంవైపు చూస్తున్న కీలక ఐటీ కంపెనీలు
- అస్తవ్యస్తంగా ఉన్న రహదారులకు మహర్దశ
- రియల్ ఎస్టేట్ రంగంలో పెను మార్పులు
- బెజవాడ చుట్టూ అందమైన జాతీయ రహదారులు
- పెరిగిన పౌరస్పృహ.. 85 శాతం మంది హెల్మెట్‌ధారణ

> మెట్రో రైల్ ప్రాజెక్టులో కదలిక.. రియల్ రంగంలో కీలక మార్పులు.. సరికొత్త జాతీయ రహదారులు.. వేగంగా విమానాశ్రయ పనులు.. క్యూ కడుతున్న ఐటీ పరిశ్రమలు.. తగ్గిన వీఐపీల రాకపోకల కష్టాలు.. ట్రాఫిక్ నిబంధనలపై పౌరుల్లో పెరిగిన అవగాహన.. హెల్మెట్‌ధారణ.. పది నెలల కాలంలో ఎంత మార్పు..! ప్రస్తుతం నగరవాసులు ఇదే ఆనందాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. గతంలో దుస్థితికి, ఇప్పటి పరిస్థితికి బేరీజు వేసుకుంటూ వేగంగా అభివృద్ధి చెందుతున్న విజయవాడను చూసి మురిసిపోతున్నారు. కీలకమైన రహదారుల అభివృద్ధి పనులను స్వాగతిస్తున్న వారు భవిష్యత్తులో నయా నగరిని తలచుకుంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

6లో

జిల్లా ప్రధాన న్యాయమూర్తి

అరుణ సారిక బదిలీ

- నూతన న్యాయమూర్తిగా జి.గోపి నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు రిజిస్ట్రార్



మచిలీపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న బి.అరుణ సారిక చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో విశాఖపట్నం జిల్లాలో ఆంధ్రప్రదేశ్ వాల్యూయాడెడ్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా పనిచేస్తున్న జి.గోపిని నియమించారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. (న్యాయాధికారుల బదిలీల వివరాలు 6లో..)

37 మంది పంచాయతీ ఉద్యోగులకు

పదోన్నతులు



మచిలీపట్నం, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాలోని వివిధ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి పదోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ బాలాజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీల్లో గ్రేడ్-4 హోదాలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు 19 మందికి, జూనియర్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తున్న 18 మందికి పదోన్నతి ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో జె.అరుణ, డీపీవో కార్యాలయ ఏవో వి.సీతారామయ్య పాల్గొన్నారు.

హెల్త్ డేంజర్ బెల్స్!

- ప్రమాదంలో ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజల ఆరోగ్యం
- ఎన్టీఆర్ జిల్లాకు హార్ట్ స్ట్రోక్.. రాష్ట్రంలోనే మొదటి స్థానం
- డయాబెటిస్‌లో వరుసగా రెండు, మూడు స్థానాలు
- షుగర్, న్యూరో, లివర్ వ్యాధులలోనూ హెచ్చు కేసులు
- జీవన అలవాట్ల మార్పుతోనే ఆరోగ్యం

> ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడనుంది. ప్రాణాంతక వ్యాధులకు మరీ ముఖ్యంగా ఎన్టీఆర్ జిల్లా దగ్గరవుతుండగా.. కృష్ణాజిల్లా నేను కూడా నీ వెంటే అన్నట్టుగా ఆ తర్వాత స్థానంలో కొనసాగుతోంది. ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు విడుదల చేసిన గణాంకాలే నిదర్శనం. హృద్రోగాలు, క్యాన్సర్, బీపీ, షుగర్ వంటి ప్రాణాంతక వ్యాధులలో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలు గణనీయమైన స్థానాల్లో ఉన్నాయి. డేంజర్ బెల్స్‌ను మోగిస్తున్నాయి. ప్రజల ఆహారపు అలవాట్లను క్రమబద్ధీకరించుకోవటంతో పాటు ఒత్తిడి లేని జీవితం గడిపితేనే ఈ ప్రాణాంతక వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. లేదంటే ఈ సంఖ్య మరింత పెరిగి.. హెల్త్ ఎమర్జెన్సీని ప్రజలు ఎదుర్కోవాల్సి పరిస్థితులు రావచ్చు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అత్యంత ప్రమాదకరమైన వ్యాధుల్లో గుండె జబ్బులు ప్రధానమైనవి. దురదృష్టం కొద్దీ ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో కొనసాగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన నివేదిక ప్రకారం ఎన్టీఆర్ జిల్లాలో సగటున 15,665 మందికి గుండె జబ్బులు వచ్చాయి. కృష్ణా జిల్లా 6వ స్థానంలో ఉంది. మొత్తం 13,106 కేసులు ఈ ఏడాది కొత్తగా నమోదు అయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో 50-54 సంవత్సరాల మధ్య వయస్సు వారికి, కృష్ణాజిల్లాలో 60 - 64 సంవత్సరాల మధ్య వయస్సుల వారికి ఎక్కువగా గుండె వ్యాధులు వస్తున్నాయి. ఆహారపు అలవాట్లు సరిగా లేకపోవటం, దురలవాట్ల కారణంగా ఈ వ్యాధులు వస్తున్నాయి. గుండెను పదిలపరచుకోవటానికి మద్యం, సిగరెట్, గుట్కాలు, మాదక ద్రవ్యాలు, నాన్ వెజ్‌కు దూరంగా ఉండాలి. పోషకాహారం ఎక్కువగా తీసుకోవటం, వ్యాయామం చేయటం వల్ల గుండె సంబంధిత వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు.

డయాబెటిస్‌లో టాప్- 2, 3లుగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు

డయాబెటిస్‌లో ఎన్టీఆర్ జిల్లా 59,921 కేసులతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. కృష్ణా జిల్లా



58,136 కేసులతో మూడో స్థానంలో ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో 45- 59 సంవత్సరాల మధ్య వయస్సు వారు డయాబెటిస్ బారిన పడుతుండగా.. కృష్ణా జిల్లాలో 50-54 మధ్య వయస్కులు డయాబెటిస్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. బీపీ, డయాబెటిస్‌లను కలిపి చూసినా కూడా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు రాష్ట్రంలోనే 2, 3 స్థానాల్లో నిలిచాయి. ఎన్టీఆర్ జిల్లాలో 1,25,339 కేసులు, కృష్ణాజిల్లాలో 1,11,932 కేసులు ప్రస్తుతం ఉన్నాయి. బీపీ, షుగర్ రెండూ కూడా ప్రాణాంతక జబ్బులే కావడం గమనార్హం.

బీపీలోనూ తగ్గేదే లేదు

బీపీ కేసుల్లో కూడా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు వరుసగా 3, 5 స్థానాల్లో ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో 98,337 కేసులు నమోదు కాగా, కృష్ణా జిల్లాలో 94,266 కేసులు నమోదు అయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో 50-54 సంవత్సరాల లోపు ఉన్న వారికి, కృష్ణాజిల్లాలో 60 - 64 మధ్య వయస్కులకు బీపీ వస్తోంది.

క్యాన్సర్ వ్యాధుల్లోనూ దూసుకువస్తున్న ఎన్టీఆర్ జిల్లా

ఎన్టీఆర్ జిల్లా ఇప్పుడిప్పుడే క్యాన్సర్ కేసుల్లోనూ దూసుకు వస్తోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎన్టీఆర్ జిల్లా 5,151 కేసులతో రాష్ట్రంలోనే 7వ స్థానంలో ఉంది. కృష్ణాజిల్లా ఈ విషయంలో 4,376 కేసులతో 17వ స్థానంలో నిలిచింది. ఇటీవల విజయవాడలోని క్యాన్సర్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడిపోతున్నాయి. ఈ దృశ్యాలు డేంజర్ బెల్స్‌ను మోగిస్తున్నాయి. దీనికి తగ్గట్టుగానే ప్రభుత్వం కూడా కేసుల మిగతా 6లో..

నేటి నుంచి నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో

వైద్య సేవలు బంద్

6లో



దుర్గమ్మకు పూల సొబగులు

అమరావతికి ‘రియల్’ బూమ్

బెంగళూరు టాప్-5 కంపెనీలకు ఆహ్వానం

- ప్రెస్టీజ్, శోభా, బ్రిగేడ్, గోద్రేజ్, మంథన్ ఎస్టేట్స్‌లకు సీఆర్‌డీఏ ఆఫర్
- హైరైజ్, రెసిడెన్షియల్, కమర్షియల్, వర్క్ ప్లేసెస్ అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి
- అమరావతికి రావటానికి సిద్ధమన్న సదరు కంపెనీలు
- స్టాంప్ డ్యూటీ మినహాయింపు కోరిన సంస్థలు
- త్వరలో ఇండియా టాప్-10 రియల్ ఎస్టేట్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలతో సీఎం భేటీ
- దేశవ్యాప్తంగా అన్ని మెట్రోపాలిటన్ నగరాల్లోని సంస్థలకూ ఆహ్వానం
- అదాని ఇన్ఫ్రా, హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్స్, డీఎస్ఆర్ గ్రూపు సంస్థల ఆసక్తి

విజయవాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతికి రియల్ బూమ్ తీసుకొచ్చేందుకు సీఆర్‌డీఏ అధికారులు చర్యలు చేపట్టారు. దేశీయంగా టాప్-10లో ఉన్న రియల్ ఎస్టేట్ అండ్ డెవలపింగ్ సంస్థలను ఆహ్వానించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ముందుగా ఇండియాలో సిలికాన్ సిటీగా పేరొందిన బెంగళూరులోని టాప్-5 రియల్ ఎస్టేట్ అండ్ డెవలపింగ్ సంస్థలకు సీఆర్‌డీఏ అధికారులు తాజాగా ఆహ్వానం పలికారు. దేశంలోనే అగ్రశేణి రియల్ ఎస్టేట్ మార్కెట్లలో బెంగళూరు కూడా ఒకటి కావటంతో సీఆర్‌డీఏ అధికారులు ముందుగా దీనిని ఎంచుకున్నారు. ఇటీవలే బెంగళూరు వెళ్లిన మునిసిపల్ మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబులు అక్కడ టాప్-5 సంస్థలతో భేటీ అయ్యారు. అమరావతిని ప్రపంచ స్థాయిలో ఏ విధంగా అభివృద్ధి


సీఆర్‌డీఏ కార్యాలయ భవనం

చేస్తున్నారో వివరించి.. అక్కడ పెట్టుబడులు పెడితే తాము భూములు ఇస్తామని ఆఫర్ చేశారు. అమరావతిలో హైరైజ్, రెసిడెన్షియల్, కమర్షియల్, వర్క్ ప్లేసెస్ వంటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాల్సిందిగా కోరారు. బెంగళూరులోని టాప్-5 కంపెనీల్లో ప్రెస్టీజ్, శోభా, బ్రిగేడ్, గోద్రేజ్, మంథన్ ఎస్టేట్స్ ఉన్నాయి. ఈ ఐదు రియల్ ఎస్టేట్ కంపెనీలు కూడా విలక్షణమైనవి.

భారీ బహుళ అంతస్తుల నిర్మాణంలో..

ఇందులో ప్రెస్టీజ్ గ్రూప్.. భారీ బహుళ అంతస్తుల భవనాలను నిర్మించటంలో అందెవేసిన చేయిగా ఉంది. ప్రెస్టీజ్ ట్రాన్స్‌ఫీల్డ్, ప్రెస్టీజ్ సాంగ్ హైట్స్ ఇటీవల దీని ప్రధాన ప్రాజెక్టులుగా ఉన్నాయి. లగ్జరీ అపార్ట్‌మెంట్స్, కమర్షియల్ స్పేస్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ వంటివి చేపట్టడంలో ఈ సంస్థ మంచి పేరుంది. శోభ లిమిటెడ్ సంస్థ తాజాగా సోభా హెరిటేజ్, సోభా హార్లాండ్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను చేపట్టింది. ఈ సంస్థ హై ఎండ్ రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాజెక్ట్స్, సస్టెయిన్‌బుల్ డిజైన్స్ చేయటంలో ప్రత్యేకతను కలిగి ఉంది. బ్రిగేడ్ గ్రూప్ కంపెనీ. బ్రిగేడ్ మెట్రోపోలిస్, బ్రిగేడ్ ఎన్‌క్లేవ్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను చేపట్టింది. మల్టీయూజ్ డెవలప్‌మెంట్, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులను నిర్మించటంలో ఈ సంస్థ ప్రత్యేకతను కలిగి ఉంది.

ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు

గోద్రేజ్ ప్రాపర్టీస్ విషయానికి వస్తే తాజాగా గోద్రేజ్ పార్క్, గోద్రేజ్ ట్రిబెకా వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను చేపట్టింది. గ్రీన్ బిల్డింగ్ ప్రాజెక్ట్స్, ప్రీమియం రెసిడెన్షియల్ స్పేస్ వంటివి కల్పించటంలో ఈ సంస్థ ప్రత్యేకతను కలిగి ఉంది. మంథన్ ఎస్టేట్స్. తాజాగా మంథన్ అవనీ, మంథన్ స్మార్ట్ వరల్డ్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను చేపట్టింది. స్మార్ట్ హోమ్స్, ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేయటంలో ఈ సంస్థ ప్రత్యేకతను కలిగి ఉంది. ఈ సంస్థల యాజమాన్యాలతో మంత్రి, సీఆర్‌డీఏ కమిషనర్ చర్చలు జరిపి అమరావతికి ఆహ్వానించారు. రాజధాని అమరావతిలో రూ.60 వేల కోట్లతో సీఆర్‌డీఏ, ఏడీసీలు అభివృద్ధి పనులు చేపడుతున్నాయి. ఈ అభివృద్ధి పనుల్లో సింహభాగం గవర్నమెంట్ కాంప్లెక్స్, అధికారులు, జడ్జిల అపార్ట్‌మెంట్లు, భవనాలు, ఎల్‌పీఎస్ మిగతా 6లో..



చెత్త డంపింగ్‌పై ఆగ్రహం

- కానూరులో చెత్త లారీలను అడ్డుకున్న స్థానికులు
- వాగ్వివాదానికి దిగిన లారీల డ్రైవర్లు .. అక్కడే నిలిపివేత
- రెండో రోజూ కొనసాగిన ఆందోళన

పెనమలూరు, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): కానూరు నుంచి ఎనికేపాడు వెళ్లే రోడ్డులో విపరీతంగా చేస్తున్న చెత్త డంపింగ్‌పై స్థానికులు రెండో రోజూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం చెత్త టిప్పర్లు కానూరు రోడ్డు వెంట డంపింగ్ చేయడానికి వచ్చాయని తెలుసుకొన్న వారు వెంటనే రోడ్డు వద్దకు చేరుకొని టిప్పర్లను అడ్డుకొని డంపింగ్ చేయనివ్వలేదు. దీంతో టిప్పర్ల డ్రైవర్లకు, స్థానికుల మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. తమ ప్రాంతంలో ఎటువంటి అధికారిక అనుమతులు లేకుండా డంపింగ్ చేయడం కుదరదని, డంపింగ్ వ్యర్థాలతో తాము తీవ్ర వాయుకాలుష్యానికి, శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు గురవుతున్నామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల వెంట చెత్తను తగులబెడుతుండడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని మండి పడ్డారు. తమ ప్రాంతంలో చెత్త డంపింగ్ చేయడానికి వీల్లేదంటూ అధికారులకు సమాచారమిచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో డంపింగ్‌ను అనుమతించేది లేదని భీష్మించారు చేసేదేమీలేక డ్రైవర్లు వాహనాలను ఆపివేశారు.



దుర్గగుడిలో చైత్రమాస వసంత నవరాత్రుల పుష్పార్చన

దుర్గమ్మకు పూల సొబగులు

- దుర్గగుడిలో ముగిసిన వసంత నవరాత్రుల పుష్పార్చన
- ఘనంగా శ్రీరాముడి పట్టాభిషేకం
- నేటినుంచి చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాలు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి, దుర్గా మల్లేశ్వర దేవస్థానంలో సోమవారం రెండు విశిష్ట కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అపరాజిత కనకదుర్గమ్మకు వసంత నవరాత్రులను పురస్కరించుకుని తొమ్మిది రోజులపాటు రోజుకొకరకం పుష్పాలతో అర్చించారు.



కనకదుర్గమ్మను పుష్పాలతో పూజించటం వలన భక్తులకు మనశ్శాంతి, ఏకాగ్రత లభిస్తాయని నమ్మిక. దేవస్థానంలో చైత్రమాస వసంత నవరాత్రులను పురస్కరించుకుని కనకాంబరాలు, చేమంతులు, గులాబీలు, సన్నజాజులు, మల్లెలు, మందారాలు, సంపెంగలు, లిల్లీ, మరువం, దవనం, కమలాలు, ఎర్ర గన్నేరు, ఎర్ర తామర.. ఇలా అనేక పుష్ప కదంబంతో దుర్గమ్మను తొమ్మిదిరోజులు అర్చించారు. సోమవారం ముగింపుగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య పూర్ణాహుతిని నిర్వహించారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



శ్రీరామచంద్రమూర్తికి సోమవారం దుర్గగుడిలోని వేదికపై పట్టాభిషేక మహోత్సవాన్ని మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. జానకమ్మను ఆదివారం పెండ్లాడిన రఘురాముడు పట్టాభిషిక్తుడయ్యాడు. శాస్త్రానుగుణంగా అర్చకులు పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు.

నేటి నుంచి చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాలు

దుర్గగుడిలో మంగళవారం నుంచి చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నెల 13వరకు కల్యాణ బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. 14 నుంచి 16 వరకు ద్వాదశ ప్రదక్షిణ కార్యక్రమాలు ఉంటాయి. ఈనెల 8వ తేదీ ఉదయం 8 గంటలకు దుర్గామల్లేశ్వరుల ఉత్సవమూర్తులను మంగళస్నానాలు చేయించి వధూవరులుగా అలంకరిస్తారు. అనంతరం అఖండ దీప స్థాపన, కలశారాధన, బలిహరణ, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణ కార్యక్రమాలు జరుగుతాయి. దివ్యలీలా కల్యాణ మహోత్సవంలో పాల్గొనదలచిన భక్తులు రూ.1,116లు చెల్లించలవలసి ఉంటుంది.

నేటి నుంచి వివిధ వాహనోత్సవాలు

కాగా, ఈనెల 8వ తేదీ నుంచి వివిధ వాహన సేవలు జరుగుతాయి. 8వ తేదీ వెండి పల్లకి సేవ, 9వ తేదీ వెండి రథోత్సవం, 10వ తేదీన రావణ వాహన సేవ, 11వ తేదీన నంది వాహన సేవ, 12వ తేదీన సింహ వాహన సేవ, 13వ తేదీన నదీ విహారం జరుగుతాయి.

ఏసీఏ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు ఎన్నిక



వన్‌టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా మాజీమంత్రి, ఏపీ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఎఫ్‌డీసీ) చైర్మన్ రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు, కౌన్సిల్ సభ్యుడిగా వడ్లమాని సుధాకర్ చౌదరి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందనలు తెలిపారు. ఏసీఏ ఆంధ్రా ప్రీమియర్ లీగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం సోమవారం జూమ్ మీటింగ్ ద్వారా జరిగింది. త్వరలో జరగనున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆంధ్రా ప్రీమియర్ లీగ్-2025, నిర్వహణ బాధ్యతలను చైర్మన్ హోదాలో సుజయ్ కృష్ణ రంగారావు చేపట్టనున్నారు. లీగ్ నిర్వహణపై త్వరలో ఆయన సమావేశం కానున్నారు. సమావేశంలో ఆంధ్రా ప్రీమియర్ లీగ్ తేదీ ఖరారు, ఫ్రాంచైజ్ అంశాలు చర్చకు రానున్నాయి.

నేటి నుంచి నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో

వైద్య సేవలు బంద్

ప్రభుత్వాసుపత్రి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 8 నుంచి నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్యసేవలు నిలిచిపోనున్నాయి. బకాయిలు చెల్లించాలని వివిధ దశల్లో నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యం ఆందోళనలు చేస్తూ వచ్చారు. ఇటీవల జిల్లా కలెక్టర్లకు సైతం ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ వినతిపత్రాలు అందించింది. సుమారు రూ.3,500 కోట్ల బకాయిలు పేరుకుపోయినట్టు సమాచారం. గత్యంతరం లేని పరిస్థితుల్లో సేవలు నిలిపివేయాల్సి వచ్చిందని సంఘాలు అంటున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం సుమారు రూ.2,500 కోట్ల బకాయిలు పెట్టిందని చెబుతున్నారు.

ఏడాదైనా ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించలేదు

– ఉప్పలపాటి వెంకట రమణ (ఆశ సంఘం అధ్యక్షుడు)

పదిరోజుల్లో చెల్లించాల్సిన ఆరోగ్యశ్రీ బిల్లులను ప్రభుత్వం ఏడాదైనా చెల్లించలేదు. ఆరోగ్యశ్రీ పథకం కింద పనిచేసే వారికి జీతాలు చెల్లించేకపోతున్నాం. మందులు, ఇంప్లాట్స్ సప్లయి చేసే వారికి డబ్బులు చెల్లించలేకపోతున్నాం. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు వైద్యసహాయం అందిస్తే దానివల్ల మాకు వచ్చే బిల్లు చెల్లింపులు కూడా చాలా తక్కువ. ఆ బిల్లులు మాకు సకాలంలో ప్రభుత్వం చెల్లిస్తే పేదలకు మెరుగైన సేవలు అందించగలుగుతాం. ప్రభుత్వం నుంచి కార్పొరేట్ ఆసుపత్రులకు 3,500 కోట్లు బకాయిలు ఉన్నాయి. అవి వెంటనే చెల్లించినట్టయితే ఆరోగ్య సేవలు కొనసాగిస్తాం. చెల్లించని పక్షంలో ఆరోగ్య సేవలు నిలిపివేస్తాం.

మట్టిలో మాణిక్యం 'నవ్య'

కృష్ణలంక, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పేదకుటుంబంలో పుట్టి, మున్సిపల్ స్కూల్‌లో విద్యనభ్యసించి బీటెక్‌లో గోల్డ్‌మెడల్ సాధించి ఎంటెక్‌లో ఏరోస్పేస్ ఇంజినీరింగ్ చేయబోతున్న కృష్ణలంక రాణిగారితోటకు చెందిన నవ్య మట్టిలో మాణిక్యంగా నిలిచింది. తండ్రి లారీడ్రైవర్, తల్లి గృహిణి. చదువుపై ఆసక్తితో నవ్య గేట్‌లో ఆలిండియాలో 120వ ర్యాంక్ సాధించింది. మేనమామ ప్రోత్సాహం.. స్వయంకృషి, పట్టుదలతో తాను ఈ స్థాయికి ఎదిగినట్టు ఆమె చెబుతోంది. చెన్నయ్‌లోని భరత్ యూనివర్సిటీలో బీటెక్ టాపర్‌గా నిలిచి గోల్డ్‌మెడల్ అందుకోవడంతో ఆమె కుటుంబసభ్యులు ఆనందంలో మునిగిపోయారు.



గోల్డుమెడల్ అవార్డు అందుకుంటున్న నవ్య

నయా.. నగరి!



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పదినెలల్లో విజయవాడ నగరంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. పట్టణాభివృద్ధి మౌలిక సదుపాయాల కల్పన దిశగా అడుగులు పడుతున్నాయి. అంతర్గత ట్రాఫిక్ సమస్యలు తప్ప గతంలో మాదిరిగా వీవీపీల రాకపోకలతో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రజల్లో ట్రాఫిక్‌పై అవగాహన, హెల్మెట్ ధారణ గణనీయంగా పెరిగింది. నగరానికి సందర్శకుల తాకిడి పెరిగింది. ఐటీ కంపెనీలు బెజవాడ వైపు చూస్తున్నాయి. అవుటర్ రింగ్ రోడ్డు ఆశలతో రియల్ ఎస్టేట్ రంగం పురోగమిస్తోంది. విజయవాడలో గత పదినెలల మార్పులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

10 నెలలు..100 పరిష్కారాలు

- మారుతున్న నగర ముఖచిత్రం
- పట్టణాభివృద్ధి దిశగా కీలక అడుగులు
- పరుగు పెడుతున్న రహదారుల పనులు
- బెజవాడవైపు ఐటీ కంపెనీల చూపు
- పెరుగుతున్న పౌర స్పృహ



నూతన ఏటీసీ టవర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విజయవాడ నగరాభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ప్రధానంగా నగరంలో అంతర్గత రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. గతంలో ఉన్న అడ్డంకులను తొలగించి విస్తరణ పనులు చేపడుతున్నారు. నగరంలో గవర్నర్‌పేట, సూర్యారావుపేట ప్రాంతాల్లో రెండు దశాబ్దాలుగా పెద్దగా రోడ్ల అభివృద్ధి జరగలేదు. ఇప్పుడు ఆ ప్రాంతాల్లో కొత్తగా రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. గుంతల స్థానంలో చక్కటి రోడ్లు దర్శనమిస్తున్నాయి. కార్పొరేషన్ నేతృత్వంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతుండగా.. సీఆర్‌డీఏ కూడా పట్టణాభివృద్ధికి తనవంతు పాత్ర పోషిస్తోంది. గ్రేటర్ విజయవాడ విలీన జాబితాలో ఉన్న శక్తి కళ్యాణమండపం రోడ్డును విస్తరించింది. విజయవాడ, ఆటోనగర్‌లలో సొంత నిధులతో రోడ్ల అభివృద్ధి, విస్తరణకు శ్రీకారం చుట్టింది.

స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీకి శ్రీకారం

విజయవాడ నగరంలో గత టీడీపీ ప్రభుత్వంలోనే అప్పటి కేంద్ర ప్రభుత్వ సహకారం రూ.1000కోట్లతో స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగింది. 'అప్పట్లో ఈ పనులు శరవేగంగా జరిగినా.. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. తిరిగి కూటమి ప్రభుత్వం రాకతో పనులో కదలిక వచ్చింది. గత వరదలను దృష్టిలో ఉంచుకుని నూరుశాతం కాలువలను నిర్మాణానికి చర్యలు చేపడతున్నారు.



పెరుగుతోన్న పౌర సదుపాయాలు

నగరంలో ప్రజలకు సదుపాయాల కల్పన పెరుగుతోంది. స్మార్ట్ లైటింగ్‌లో భాగంగా ఎల్ఈడీ అప్‌గ్రెడేషన్ జరుగుతోంది. పార్కులు, రోడ్లు, సర్క్యులేటింగ్ ఏరియాలలో ఈ లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ విధానాలను అవలంబిస్తున్నారు. ఎక్కడికక్కడ స్మార్ట్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో కొన్ని ఏఐ ఆధారిత స్మార్ట్ సీసీ కెమెరాలు కూడా ఉన్నాయి. స్మార్ట్ వాటర్ మీటరింగ్ సిస్టమ్‌కు శ్రీకారం చుట్టారు.



మెట్రో రైల్‌కు కదలిక

మూలన పడ్డ మెట్రో రైల్ ప్రాజెక్టుకు కదలిక వచ్చింది. తొలి విడతలో గన్నవరం నుంచి ఏలూరు రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్, పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు తొలిదశలో భూ సేకరణ పనుల ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. కోచ్ డిపోకు స్థలాన్వేషణ చేస్తున్నారు. పాసింజర్ మొబిలిటీ సర్వే జరుగుతోంది.



రియల్ రంగానికి ఊపు

స్తబ్దుగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం ఒక్కసారిగా పుంజుకుంటోంది. అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు వస్తుండటంతో పొరుగు రాష్ట్రాల రియల్టర్లు కూడా అమరావతి వైపు చూసే పరిస్థితి ఏర్పడింది. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ చుట్టూ భూ క్రయ విక్రయాలు ఊపందుకుంటున్నాయి. ఓఆర్ఆర్ పనులు మొదలైతే మరింత క్రయ విక్రయాలు జరిగే పరిస్థితి ఉంది.

కొత్త జాతీయ రహదారులతో మహర్దశ

విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవేకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో జక్కంపూడి నుంచి ఖమ్మం జిల్లా వరకు 30 కిలోమీటర్ల నిడివిలో నిర్మాణానికి 245 ఎకరాల భూముల సేకరణలో ఇప్పటికే 90శాతం పైగా పూర్తి చేయటం జరిగింది. విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు మరో ఐదునెలల్లో అందుబాటులోకి రానున్నాయి.

విమానాశ్రయంలో ఊపందుకున్న పనులు

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనులు ఊపందుకున్నాయి. 40 శాతం నుంచి 70 శాతం వరకు పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే కొత్త ఆప్రాన్ అందుబాటులోకి వచ్చింది. నూతన ఏటీసీ టవర్ పనులు తుది దశలో ఉన్నాయి. మరో నాలుగు నెలల్లో నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ అందుబాటులోకి రానున్నది.

ఐటీ పరిశ్రమల దిశగా అడుగులు



గత ఐదేళ్లలో విజయవాడ, కేసరపల్లి సెజ్‌ల నుంచి తరలిపోయిన ఐటీ పరిశ్రమలు తిరిగి విజయవాడ వైపు చూస్తున్నాయి. ఇప్పటికే సంప్రదింపులు ప్రారంభించాయి. ఎన్నారై సౌజన్యంతో ఐటీ పరిశ్రమలను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరోవైపు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) నేతృత్వంలో అంకుర సంస్థలకు విన్‌సిటీ ఆహ్వానం పలుకుతోంది.

గ్రీన్ ఎనర్జీ దిశగా అడుగులు



సోలార్ పవర్ ప్రాజెక్టుల ప్రోత్సాహకం బాగా జరుగుతోంది. ప్రధానంగా పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రైవేటు కంపెనీల భాగస్వామ్యంతో ముందుకు తీసుకు వెళ్లేందుకు కృషి జరుగుతోంది. నగరంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను మొదటి దశలో నూరుశాతం సూర్యఘర్ కిందకు తీసుకు వచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

పెరుగుతున్న పౌర స్పృహ

నగరంలో పౌర స్పృహ పెరుగుతోంది. హెల్మెట్ వినియోగాన్ని తప్పనిసరి చేయటంతో సత్ఫలితాలను ఇస్తోంది. నూటికి 85 శాతం మందికి పైగా హెల్మెట్లు వినియోగిస్తున్నారు. ప్రజల్లో పెద్ద ఎత్తున మార్పు వచ్చింది. నూరుశాతం దిశగా అడుగులు పడుతున్నాయి.

తగ్గిన వీఐపీ ట్రాఫిక్ కష్టాలు

నగరంలో వీఐపీ వాహనాల రాకపోకలతో గతం కంటే ట్రాఫిక్ సమస్యలు తగ్గాయి. గతంలో అంతర్గత ట్రాఫిక్ సమస్యలకు తోడు.. వీఐపీల వాహనాల రాకపోకల వల్ల ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్థంభించేది. ఇప్పుడు అంతర్గత ట్రాఫిక్ సమస్యలు దాదాపుగా తగ్గింది. ప్రజలు గంటల తరబడి వేచిఉండే పరిస్థితి లేదు.

జిల్లాలో న్యాయాధికారుల బదిలీ

- ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి హిమబిందుకు న్యాయసేవా ప్రాధికార సంస్థ సభ్యకార్యదర్శిగా పోస్టింగ్

విజయవాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని ఎస్పీఈ అండ్ ఏసీబీ కమ్ మూడో అదనపు జిల్లా, సెషన్స్(ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు) న్యాయాధికారి బి.సత్యవెంకట హిమబిందు బదిలీ అయ్యారు. ఆమెను అమరావతిలోని రాష్ట్ర న్యాయసేవా ప్రాధికార సంస్థ సభ్యకార్యదర్శిగా బదిలీ చేశారు. రాష్ట్రంలో 54 మంది న్యాయాధికారులను బదిలీ చేస్తూ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ బదిలీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన పలువురు న్యాయాధికారులను ఇతర జిల్లాకు పంపారు. గుంటూరులోని పోక్సో కోర్టు న్యాయాధికారిగా ఉన్న ఎ.అనితను విజయవాడలోని ప్రజాప్రతినిధుల కేసు విచారణ కోర్టుకు బదిలీ చేశారు. ఇక్కడున్న ఎస్.శ్రీదేవిని ఏలూరులోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జిగా బదిలీ చేశారు. కడపలోని ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారి షేక్ ఇంతియాజ్ అహ్మద్‌ను విజయవాడలోని 14వ అదనపు సెషన్స్ జడ్జి కం అడిషనల్ ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారిగా బదిలీ చేశారు. మచిలీపట్నంలోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జిగా ఉన్న అరుణసారికను చిత్తూరులోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జిగా బదిలీ చేశారు. మచిలీపట్నంలోని ఒకటో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జిగా ఉన్న చిన్నంశెట్టి రాజు విశాఖపట్నంలోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జిగా బదిలీ అయ్యారు. విశాఖపట్నంలోని వ్యాట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా ఉన్న జి.గోపి మచిలీపట్నంలోని జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టుకు బదిలీ అయ్యారు. మచిలీపట్నంలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ కోర్టు న్యాయాధికారిగా ఉన్న ఎస్.చిన్నబాబును అనంతపురంలోని పోక్సో కోర్టుకు బదిలీ చేశారు. విజయవాడలోని 12వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టు న్యాయాధికారిగా ఉన్న పి.భాస్కరరావును ఏలూరులోని ఒకటో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టుకు బదిలీ చేశారు. విజయవాడలోని 14వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయాధికారి యు.ఇందిరా ప్రియదర్శిని ఏలూరులోని భూ సంస్కరణల అప్పిలేట్ అథారిటీ చైర్మన్‌గా బదిలీ అయ్యారు. విజయవాడలోని ఏడో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయాధికారి ఎస్.నాగేశ్వరరావు విశాఖపట్నంలోని ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ కమ్ లేబర్ కోర్టు ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. విజయవాడలోని మహిళా కోర్టు న్యాయాధికారి పి.రాజారావును విశాఖపట్నంలోని అదనపు ఫ్యామిలీకోర్టుకు బదిలీ చేశారు. కర్నూలులోని ఒకటో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జిగా ఉన్న జి.భూపాల్‌రెడ్డిని విజయవాడలోని ఏసీబీ కోర్టుకు బదిలీ చేశారు. కర్నూలులోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ కోర్టు న్యాయాధికారి పి.పాండురంగారెడ్డిని మచిలీపట్నంలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానానికి బదిలీ చేశారు.

ఏలూరులోని ఐదో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయాధికారిగా ఉన్న జి.రాజేశ్వరిని విజయవాడలోని మహిళా కోర్టుకు బదిలీచేశారు. విజయవాడలోని సహకార ట్రిబ్యునల్ చైర్మన్‌గా ఉన్న టి.వెంకటేశ్వర్లు ఇక్కడే నాలుగో అదనపు జిల్లా కమ్ ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారిగా నియమితులయ్యారు. విజయవాడలోని ఫ్యామిలీ కోర్టు కమ్ నాలుగో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జిగా ఉన్న కె.సునితను సహకార ట్రిబ్యునల్ చైర్మన్‌గా నియమించారు.

మదనపల్లెలోని రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు న్యాయాధికారి బండెల అబ్రహంను విజయవాడలోని ఏడో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. చిత్తూరులోని మహిళా కోర్టు న్యాయాధికారి బి.బాబునాయక్‌ను మచిలీపట్నంలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టుకు బదిలీ చేశారు. మచిలీపట్నంలోని ఆరో అదనపు జడ్జి సెషన్స్ కోర్టు న్యాయాధికారి ఎ.పూర్ణిమను ఒంగోలులోని ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు బదిలీ చేశారు. ఏలూరులోని ఒకటో అదనపు జిల్లా స్పెషల్ జడ్జి కోర్టు న్యాయాధికారి ఎం.సునీల్‌కుమార్‌ను విజయవాడలోని 12వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు.

హెల్త్ డేంజర్ బెల్స్!

(5వ పేజీ తరువాయి)

తీవ్రతను తెలియచెప్పింది. క్యాన్సర్ అనేది రాకుండా చూసుకోవటానికి అవగాహన తప్పనిసరి. ప్రతి సంవత్సరం ప్రతి ఒక్కరూ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉంది.

కాలేయ వ్యాధుల్లోనూ..

ఎన్టీఆర్ జిల్లా 1,351 కాలేయ సంబంధిత కేసులతో రాష్ట్రంలోనే 9వ స్థానంలో ఉంది. కృష్ణా జిల్లా ఈ విషయంలో 1,002 కేసులతో 17వ స్థానంలో నిలిచింది. ఈ వ్యాధులు ఎక్కువగా రెండు జిల్లాల్లో కూడా 50 - 54 సంవత్సరాల వారిలోనే ఎక్కువగా నమోదవుతున్నాయి.

మిగిలిన వ్యాధుల్లోనూ..

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో న్యూరో కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. కృష్ణాజిల్లాలో 4,154 కేసులతో 10వ స్థానంలోనూ, ఎన్టీఆర్ జిల్లాలో 4,063 కేసులతో 11వ స్థానంలోనూ నిలిచాయి. అలాగే కిడ్నీ కేసుల్లో ఎన్టీఆర్ జిల్లా 6,291 కేసులతో 16వ స్థానంలోనూ, కృష్ణాజిల్లా 4,761 కేసులతో 22వ స్థానంలో ఉంది.

జాప్యం!

(5వ పేజీ తరువాయి)

టన్నుల ధాన్యం కొనుగోలు చేసినా ఇంతవరకు ధాన్యం రవాణా బిల్లులను పూర్తిస్థాయిలో లెక్కలు తేల్చలేదు. ఈ లెక్కలు ప్రభుత్వానికి పంపితేనే, నగదును విడుదల చేయడానికి అవకాశం ఉంటుంది. ధాన్యం రవాణా బిల్లులను ప్రభుత్వానికి ఎప్పటికి పంపుతారు, ఎప్పటికి విడుదల అవుతాయనే అంశంపై రైతుల్లో సందిగ్ధం నెలకొంది. అయితే మిల్లు యాజమానులు ధాన్యం రవాణాకు సంబంధించిన బిల్లులను పూర్తిస్థాయిలో పంపలేదని పౌరసరఫరాలసంస్థ జిల్లా మేనేజర్ పద్మాదేవి చెబుతున్నారు.

అమరావతికి 'రియల్' బూమ్

(5వ పేజీ తరువాయి)

ఇన్ఫ్రా, ట్రంక్ ఇన్ఫ్రా వంటివి ఉన్నాయి. ఇవన్నీ పూర్తయితే అమరావతికి ఓ రూపు వస్తుంది. ఇవికాకుండా మహానగరంగా విస్తరించాలంటే అమరావతిలో యాక్టివిటీని పెంచాల్సి ఉంటుంది. రియల్ ఎస్టేట్ ఊపందుకుంటే తప్ప వివిధ రంగాల కార్యకలాపాలు వేగవంతమయ్యే అవకాశం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని రియల్ బూమ్‌కు కేంద్రస్థానంగా మార్చాలని భావిస్తోంది. రియల్ బూమ్ కోసం ఇండియా టాప్-10 రియల్ ఎస్టేట్ కంపెనీలకు చోటు కల్పించాలని భావిస్తోంది. ఇండియా టాప్-10లో బెంగళూరులో టాప్-5 ఉన్నాయి. కాబట్టి బెంగళూరులో ఆయా సంస్థల ప్రాజెక్టులను మంత్రి, కమిషనర్‌లు అధ్యయనం చేశారు. రాజధాని అమరావతిలో కూడా ఆ స్థాయి ప్రాజెక్టుల్లో పాలు పంచుకోవాల్సిందిగా ఆహ్వానం పలికారు. అమరావతిలో అవసరమైన భూములు ఇస్తామని, 60:40 విధానంలో హైరైజ్ బిల్డింగ్స్, రెసిడెన్షియల్, కమర్షియల్, వర్క్ ప్లేసెస్ వంటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. బెంగళూరు టాప్-5 రియల్ ఎస్టేట్ సంస్థలు సీఆర్‌డీఏ ప్రతిపాదన పట్ల సానుకూలంగా స్పందించాయి. తాము అమరావతి రావటానికి సిద్ధంగానే ఉన్నామన్న ఆసక్తిని తెలిపాయి. కొన్ని సందేహాలను కూడా వ్యక్తం చేశాయి. అమరావతి నిర్మాణం జరుగుతున్న దశలో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు వెంటనే డిమాండ్ ఉంటుందా అనే సందేహాలు వ్యక్తం చేసినట్టు సమాచారం. అమరావతిని ప్రజా రాజధానిగా తీర్చిదిద్దటానికి అన్ని కార్యక్రమాలను చేపట్టామని, అమరావతి చుట్టూ రియల్ బూమ్ కేంద్రీకృతమైందని, తప్పకుండా ప్రాజెక్టులు విజయవంతమవుతాయని మంత్రి, కమిషనర్ హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్టాంప్ డ్యూటీ వంటి కొన్ని మినహాయింపులు కూడా కోరినట్టు తెలిసింది. ఇలాంటి మినహాయింపులపై ముఖ్యమంత్రి స్థాయిలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని వారిరువురూ చెప్పారు.

టాప్-10 సంస్థలతో సీఎం భేటీ

త్వరలో దేశంలోని టాప్-10 రియల్ ఎస్టేట్ అండ్ డెవలపింగ్ సంస్థలతో ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో భేటీ కానున్నారు. దేశంలోని టాప్-10 సంస్థలను అమరావతికి ఆహ్వానించి ఇక్కడ చేపడుతున్న ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో చూపించనున్నారు. ఆ తర్వాత సీఎం స్థాయిలో సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇచ్చే ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి ప్రకటించే అవకాశం ఉంటుంది. ఈ సమావేశానికి ముందే అమరావతిలో ఎలాంటి ప్రాజెక్టులను చేపట్టాలన్న దానిపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుంటారు.

అదానీ, హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్స్ ఆసక్తి

అమరావతి రాజధానిపై అదానీ, హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్స్ వంటి బడా నిర్మాణ సంస్థలు కూడా ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. హైదరాబాద్‌కు చెందిన డీఎస్ఆర్ గ్రూపు కూడా అమరావతిలో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులపై ఆసక్తి చూపిస్తోంది.

సంపద సృష్టి, వృద్ధిరేటుపై దృష్టిపెట్టండి

- ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త లక్ష్య సాధనకు కృషిచేయాలి
- ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనకు, సమాజ అవసరాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, సంపద సృష్టి, వృద్ధిరేటుపై ప్రతిశాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త నినాదాన్ని ముందుకు తీసుకెళ్తూ ఔత్సాహికులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలన్నారు.



ప్రజాసమస్యలు వింటున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించాలని, పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను, పథకాలను సద్వినియోగం చేసుకొనేలా గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అధికారులు సమాజ అవసరాలకు అనుగుణంగా విధులను చిత్తశుద్ధి, నిబద్ధతతో నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈనెల 10న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వర్ణాంధ్ర విజన్ 2047, వృద్ధి ఇంజన్లపై జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులకు వర్క్‌షాపు నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని, ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించి అర్జీదారులు సంతృప్తిచెందేలా పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోండి : లక్ష్మీశ

కలెక్టరేట్ : సంఘటిత, అసంఘటిత రంగాల్లోని కార్మికులతో పాటు ఓలా, బ్లింకిట్, స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ ప్లాట్ ఫాం కార్మికులు ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కోరారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక శాఖలు, సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకొనేందుకు ఈనెల 17వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక నమోదు శిబిరాలపై కార్మిక శాఖ రూపొందించిన అవగాహన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అసంఘటిత రంగాల కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలను చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించిందన్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల వ్యాప్తంగా కార్మిక శాఖ అధ్వర్యంలో ప్రత్యేక నమోదు శిబిరాలలో సంబంధిత కార్మికులు తప్పనిసరిగా పోర్టల్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

వెలగని వీధిలైట్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఉయ్యూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన అధ్వానంగా ఉన్న సర్వీసు రోడ్ల నిర్వహణ, వెలగని వీధి లైట్లతో ప్రమాదాలు జరుగుతున్నాయని సోమవారం పబ్లిక్‌గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. జాతీయ రహదారి వెంబడి ఉయ్యూరు - పామర్రు మధ్యలో గోపువానిపాలెం, గురజాడ, మంటాడ, ఉయ్యూరు- కంకిపాడు మధ్య గండిగుంట, ఆ కునూరు ఫ్లైఓవర్‌ల వద్ద అండర్ పాస్‌ల్లో లైట్లు నెలల తరబడి వెలగపోవడం వల్ల, సర్వీసు రోడ్ల మార్జిన్ల నిర్వహణ సరిగాలేనందున చీకటిలో రోడ్లపై నడిచేవారు, రోడ్డు దాటుతున్న సమయంలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని, ఈవిషయమై జాతీయ రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్ తగు చర్యలు తీసుకొనేల చూడాలని కోరు తూ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

డెక్క లెక్క తేల్చాలి!

- అసంపూర్తిగా గుర్రపు డెక్క నిర్మూలన పనులు
- పుల్లేరు కాల్వగట్ల వెంబడి మందు పిచికారీ చేసి మధ్యలో వదిలేశారు
- తిరిగి కాల్వంతా అలుముకుంటున్న గుర్రపు డెక్క తూడు
- డ్రోన్లతో చల్లించాలంటున్న రైతులు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

పుల్లేరుకాల్వలో గుర్రపుడెక్క నిర్మూలన పనులు అసంపూర్తిగా చేయడంతో తిరిగి యథాస్థితికి చేరుకుంటూ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన తయారైంది. దిగువ ప్రాంతాలలో వేలాది ఎకరాలు, వందాలది గ్రామాలకు సాగు, తాగునీరందించే పుల్లేరు కాల్వ ఉయ్యూరు మండల పరిధిలో గుర్రపుడెక్కతో నిండి పంటసాగు చేసే సమయంలో నీటి ప్రవాహానికి అడ్డుగా నిలుస్తుంది. కాల్వలో డెక్క నిర్మూలించేందుకు ఇటీవల కాల్వకు రెండువైపులా కట్టల వెంబడి ఇరిగేషన్ అధికారులు కలుపు నివారణ మందు గ్రామోక్సిన్ స్ప్రే చేయించి చేతులు దులుపుకున్నారు. దీంతో కాల్వ పొడవునా ఇరువైపులా కట్టల వెంబడి డెక్క ఎండిపోగా మధ్యలో పచ్చగా నిగనిగలాడుతూ పెరిగి కాల్వంతా అలుముకుంటుంది. ప్రస్తుతం కాల్వలో నీరు ఎండిపోతున్న పరిస్థితుల్లో డెక్క అంతా నిర్మూలించేందుకు డ్రోన్‌లతో గ్రామోక్సిన్ చల్లించాలని రైతులు కోరుతున్నారు. లేకుంటే తిరిగి వ్యవసాయ పనులు ప్రారంభించే నాటికి యథాస్థితికి చేరుకుంటుందని ఆందోళన చెందుతున్నారు.



ఉయ్యూరు వద్ద పుల్లేరుకాల్వలో అల్లుకున్న గుర్రపు డెక్క, తూడు

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం

కంకిపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో గ్రామ ప్రజలకు నీటిఎద్దడి లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని కంకిపాడు సర్పంచ్ బాకి రమణ అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడులో బోరు ఏర్పాటు కు సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బాకి రమణ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే ఎస్సీ కాలనీతో పాటు బ్యాంకు కాలనీలో కొత్తగా బోరు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి, ఈవో సాంబశివరావు, వార్డు సభ్యులు, పలువురు ఎంపీటీసీ పాల్గొన్నారు.



ఇంటర్ విద్యార్థినులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న ఎంఈవో సాంబశివరావు

నోట్‌బుక్స్ అందజేత

ఉంగుటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తేలప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్-1 బాలికల జూనియర్ కళాశాలను సోమవారం ఎంఈవో జె.సాంబశివరావు సందర్శించారు. ఇంటర్ విద్యార్థినులకు ప్రభుత్వం అందజేసిన ఉచిత నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో సాంబశివరావు మాట్లాడుతూ, కళాశాలలో బైపీసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయని చెప్పారు. పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థినులు ప్రభుత్వ కళాశాలలో చేరాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ వేలూరి ఆదిలక్ష్మి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ ఎ.పైడితల్లి, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఆత్కూరులో ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని సర్పంచ్ పి.ఎస్తేరమ్మ అన్నారు. మండలంలోని ఆత్కూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎస్తేరమ్మ మాట్లాడుతూ, వైద్యుల సూచనల సలహాలు పాటించి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని చెప్పారు. డాక్టర్ జితేంద్రకుమార్ మాట్లాడు తూ, ఎక్కువగా ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారని ముందస్తుగా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. 130 ప్రశ్నలకు సంబంధించి వివరాలను ప్రతి కుటుంబం నుంచి తెలుసుకుని ఆన్‌లైన్ చేస్తున్నట్లు తెలిపారు. హెల్త్‌సూప ర్‌వైజర్ ఎ.నాగమల్లేశ్వరరావు, హెచ్‌వీ ఎండీ అలీమబీ, సిబ్బంది పాల్గొన్నారు.



అనుమతి లేని కట్టడాలు కూల్చివేత

పెనమలూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీలోని యనమలకుదురు డొంకరోడ్డులో అనుమతి లేకుండా నిర్మించిన కట్టడాన్ని మునిసిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం కూల్చివేశారు. అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని కమీషనర్ భవానీప్రసాద్ హెచ్చరించారు.



పనులు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ ఆర్నేపల్లి సూరిబాబు, కొండపల్లి వెంకన్న

ఉపాధి పథకం రైతులకు వరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం ద్వారా సాగునీటి కాలువల పూడికతీత రైతులకు వరమని మాజీ సర్పంచ్ ఆర్నేపల్లి సూరిబాబు అన్నారు. ఉమామహేశ్వరపురంలో ఉపాధిహామీ పథకం ద్వారా సాగునీటి కాలువ పూడికతీత పనులను సోమవారం టీడీపీ అధ్యక్షుడు కొండపల్లి వెంకన్నతో కలిసి ప్రారంభించారు. ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో చిన్నపాటి సమస్యలు పరిష్కారమవడంతో పాటు వేసవిలో కూలీలకు పని కల్పిస్తూ ఉభయతారకంగా చేయూతగా నిలుస్తోందన్నారు. టీఎన్‌టీ యుసీ నాయకుడు పాండురంగారావు, గండి శ్రీను, అచ్చియ్య, రవి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాచవరం మేజర్‌కు 300 క్యూసెక్కుల నీటిని నిరాటంకంగా సరఫరా చేయాలి

గన్నవరం / హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మాచవరం మేజర్‌కు 300 క్యూసెక్కుల నీటిని నిరాటంకంగా సరఫరా చేయాలని నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణ అన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విశేషకృషి మేరకు నాగార్జునసాగర్ ఎడమ కాలువ మూడవ జోన్‌లోని నూజివీడు బ్రాంచ్ కాలువకు వారం రోజుల క్రితం నీటి విడుదల చేసిన అనంతరం ఈదర దగ్గర మాచవరం మేజర్ రెగ్యులేటర్ నుంచి దిగువ ఆయకట్టుకు తాగునీరు విడుదల చేసిన నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ఆగిరిపల్లి మండలం శోభనాపురం చేరుకోగా 6.00 కిలోమీటరు వంతెన దగ్గర పలువురితో కలసి పరిశీలించారు. దిగువ ప్రాంతాల్లోని గన్నవరం నియోజకవర్గంలోని గొల్లనపల్లి, కొండపావులూరు, సూరంపల్లి, నున్న నీటి సంఘాల పరిధిలో ఆరుతడి పంటలకు, తాగునీటి చెరువులకు ఇవ్వాల్సి ఉందన్నారు. జక్కంపూడి మేజర్ ద్వారా దిగువ ప్రాంతానికి కూడా సాగునీరు ఇవ్వవలసి ఉన్న దృష్ట్యా మాచవరం మేజర్‌కు 300 క్యూసెక్కులు పెంచాలని కోరారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పామర్తి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ ఉప్పు వెంకటేశ్వరరావు, కొల్లి శ్రీనివాసరెడ్డి, యర్రా వెంకట శ్రీనివాసరావు, ఎన్ఎస్పీ ఏఈఈలు వై.నవీన్ బాబు, కె.ప్రసన్నకుమార్, నల్లజాల హరిబాబు, నక్కనబోయిన బాబూరావు, వేటూరి నాగమల్లేశ్వరరావు, నిమ్మగడ్డ శ్రీనివాసరావు, నల్లజాల రాజారావు, నక్కనబోయిన రత్నారావు తదితరులు పాల్గొన్నారు.



మాచవరం మేజర్ రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న ఎనెస్పీ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ

బాపులపాడు మేజర్ ద్వారా..

బాపులపాడు మేజర్ పరిధిలోని ఆరుతడి పంటలను రక్షించేందుకు, చెరువులను తాగునీటితో నింపేందుకు నాగార్జునసాగర్ నీటి విడుదలను 200 క్యూసెక్కులకు పెంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు ఇవ్వాలని ఎనెస్పీ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అధికారులను కోరారు. నూజివీడు మండలం రావిచర్ల వద్ద గల బాపులపాడు మేజర్ రెగ్యులేటర్ వద్ద నీటి విడుదలను సోమవారం డీసీ చైర్మన్‌లు, అధికారులతో కలిసి పరిశీలించారు. దిగువకు 50 క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో సాగర్ జలాలకు పూలుజల్లి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బాపులపాడు డీసీ వైస్ చైర్మన్ గంపా పంగిడేశ్వరావు, రామన్నగూడెం నీటి సంఘ అధ్యక్షుడు పల్లగాని నాగేంద్రరావు, మల్లవల్లి నీటి సంఘ అధ్యక్షుడు తమ్మిశెట్టి రాంబాబు, చొప్పర మెట్ల సర్పంచ్ కూరాకుల ఊర్మిళ, ఆయకట్టు దారులు జూలూరి కోటేశ్వరరావు, అక్కినేని కృష్ణాజీ పాల్గొన్నారు.

బీసీ రుణ దరఖాస్తుదారులకు నేటి నుంచి ఇంటర్వ్యూలు

గుణదల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు చేయూత నిచ్చేందుకు ప్రభుత్వం మంజూరు చేయనున్న రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు విజయవాడ రూరల్ ఎంపీడీవో మురళీకృష్ణ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.



గన్నవరం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న హరిబాబు నాయుడు

టీడీపీలో కొత్త వ్యవస్థ

- 30 మంది ఓటర్లకు సాధికార సారథులు
- నియోజకవర్గ పరిశీలకులు వడ్రాణం హరిబాబు నాయుడు

గన్నవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : టీడీపీలో కొత్త వ్యవస్థను అధినేత చంద్రబాబునాయుడు తీసుకువచ్చారని, ప్రతి 30 మంది ఓటర్లకు సాధికార సారథులను నియమించాలని నియోజకవర్గ పరిశీలకులు వడ్రాణం హరిబాబు నాయుడు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు కుటుంబ సాధికార సారథుల నియమకాలపై అవగాహనకల్పిస్తూ పార్టీ నాయకులు, క్లస్టర్, యూనిట్, పోలింగ్ బూత్ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థిక అసమానతలు తొలగించేలా ఈ సారథులు పనిచేస్తారని తెలిపారు. మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా కుటుంబ సాధికార సారథి విభాగం ఉంటుందని, ప్రతి కుటుంబానికి న్యాయం చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఎన్నికల కోసం కాకుండా సమాజాన్ని ముందుకు తీసుకుపోయేందుకు కుటుంబ సాధికార సారథులను నియమిస్తున్నామని, 25వేల ఓట్లకు ఓ క్లస్టర్‌గా తీసుకున్నామని, 5వేలకు ఒక యూనిట్‌గా పెట్టామని తెలిపారు. 30 నుంచి 60 ఓట్ల కోసం ఇద్దరు కుటుంబ సాధికార సారథులుగా నియమించే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందేవిధంగా ఈ వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు. టీడీపీ శ్రేణులు అందరూ ఈ వ్యవస్థలో భాగస్వాములు కావాలని, త్వరితగతిన కుటుంబ సాధికార సారథుల నియమకాలు పూర్తి చేసి కేంద్ర కార్యాలయానికి పంపాలని పిలుపునిచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యనారాయణ ప్రసాద్ (సూర్యం), రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, బోడపాటి రవికుమార్, మేడేపల్లి రమా, కొసరాజు సాయిరాం, రామినీడు బసవపూర్ణయ్య, పాలడుగు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పన్నులు తగ్గించాలి : జనసేన

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు గ్రామ పంచాయతీ పెంచిన ఇళ్ల పన్నులను సవరించాలని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబు పంచాయతీ అధికారులను డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో గ్రామసభ నిర్వహించాలని పంచాయతీని ఇటీవల కోరడంతో పంచాయతీ కార్యదర్శి బీఎస్. పూర్ణేశ్వరి సోమవారం ప్రత్యేకంగా గ్రామసభ నిర్వహించారు. ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ అధ్యక్షతన జరిగిన సభలో చలమలశెట్టి రమేశ్‌బాబు మాట్లాడుతూ, 2013-14,2014-15లో అప్పటి పాలకవర్గం పెంచిన ఇళ్ల పన్నులు భారంగా మారడంతో ప్రజలు వ్యతిరేకించారన్నారు. ఇష్టారీతిగా పెంచిన పన్నులను తగ్గించకుండా ప్రతి ఏడాది 5శాతం పెంచుతూ వసూళ్ల చేయ డానికి పూనుకోవడం అన్యాయమన్నారు. ఈ మేరకు సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. దీనిపై జిల్లా అధికారులకు తీర్మానం చేసి పంపుతామని కార్యదర్శి హామీ ఇచ్చారు. సమా వేశంలో గ్రామ ప్రముఖులు వేగుంట రామారావు, వీరమాచనేని నాగయ్య, యలమంచలి శ్రీరామచంద్రమూర్తి, పలువురు బాధితులు రమేశ్‌బాబుకు మద్దతుగా మాట్లాడారు. వార్డు సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, మేకల మరియమ్మ, కంచర్ల అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు

గొలుసు దొంగల అరెస్టు

ఆరు బంగారపు గొలుసులు, రెండు బైకులు స్వాధీనం

గన్నవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గొలుసు దొంగతనం కేసులో నలుగురు నిందితులను ఆత్కూరు పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను గన్నవరంలో డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు సోమవారం వెల్లడించారు. గన్నవరం నుంచి పొట్టిపాడు వస్తుండగా మార్గమధ్యంలో గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి తన మెడలోని బంగారపు గొలుసు లాక్కొని పారిపోయారని ఒక మహిళ ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై చావా సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. నేరం చేసింది మంగళగిరికి చెందిన పాత నేరస్తులని గుర్తించారు. వారి కదలికలపై నిఘా ఉంచి నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా మూడు నేరాలు చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి 6 బంగారపు గొలుసులు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్సై చావా సురేష్, పీసీలు పవన్ కుమార్, నరేష్, రామారావు ఆంజనేయులు, దుర్గా ప్రసాద్‌లను ఎస్పీ ఆర్ గంగాధర రావు ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. హనుమాన్ జంక్షన్ సీఐ కెవిఎస్‌ఎన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చింతమనేని చొరవతో ట్రాఫిక్ క్లియర్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) : ఆరుగొలను వద్ద రహదారిపై లారీ ఆగిపోయింది. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. అదే సమయంలో గుడివాడ నుంచి దెందులూరు వెళ్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరరావు లారీని పక్కకు నెట్టి సమస్యను పరిష్కరించారు. ఆరుగొలను వద్ద సోమవారం ఉదయం భారీలోడుతో ఉన్న లారీ సాంకేతిక కారణాలతో రహదారికి అడ్డంగా ఆగిపోయింది. అదే సమయంలో గుడివాడ నుంచి దెందులూరు వెళ్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గమనించారు. లారీ డ్రైవర్‌తో మాట్లాడి తాము సహాయం చేస్తామని లారీని పక్కకు తీయాలన్నారు. తన అనుచరులతో పాటు స్థానికులు సహాయం అందించగా ఎమ్మెల్యే చింతమనేని స్వయంగా లారీని నెడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేశారు.



లారీని పక్కకు తోస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పరిశుభ్రత పచ్చదనంతోనే ఆరోగ్యం

హనుమాన్‌జంక్షన్ / రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పరిసరాలు, గ్రామ వీధులు పచ్చదనం పరిశుభ్రంగా ఉన్నపుడే ఆగ్రామ ప్రజలు ఆరోగ్యంగా జీవించగలుగుతారని పలువురు బాపులపాడు మండల నేతలు పేర్కొన్నారు. సోమవారం జంక్షన్ విజయవాడ రోడ్డులో బాపులపాడు, వేలేరు గ్రామ పంచాయతీలు వారి పరిధిలోని రహదారి డివైడరుపై మొక్కలు నాటి గ్రీనరీని అభివృద్ధి చేయడానికి శ్రీకారం చుట్టారు. ఇరు పంచాయతీలు శేరీనరసన్నపాలెం అడ్డరోడ్డు వద్ద డివైడరుపై వారి వారి పరిధిలో వేలేరు అడ్డ రోడ్డు నుంచి జంక్షన్ సెంటర్ వరకు మొక్కలు నాటారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలు మేరకు వేలేరు గ్రామ పంచాయతీ పరిధిలో 134, బాపులపాడు గ్రామం పరిధిలో 340 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బాపులపాడు గ్రామ ఉప సర్పంచ్ దుట్టా శివనారాయణ, కూటమి నాయ కులు మూల్పూరి సాయికల్యాణి, దయాల రాజేశ్వరరావు, వేములపల్లి శ్రీనివాస రావు, వీరమాచనేని సత్యప్రసాద్, చలమలశెట్టి రమేశ్‌బాబు, అట్లూరి శ్రీనివాసరావు, సింగవరపు భాస్కర్ గణేష్, చిన్నాల లక్ష్మీనారాయణ, మొవ్వా వేణుగోపాల్, గార్లపాటి రాజేశ్వరరావు, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, ఈవోపీఆర్డీ కె.లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శులు బీఎస్. పూర్ణేశ్వరి, టి.సురేశ్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గన్నవరం : పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక అన్నారు. మండలంలోని కేసరపల్లి శివారు వీఎన్‌పురం కాలనీలో సోమవారం డ్రైనేజీలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా లక్ష్మీమౌనిక మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో వీఎన్‌పురం కాలనీని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అడ్డరోడ్డులో నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. డ్రెయినేజీలను శుభ్రంగా ఉంచుకుంటేనే మురుగు నిల్వ ఉండకుండా కిందకి వెళ్లిపోతాయన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణమూర్తి, వడ్డే శోభనాద్రీశ్వరరావు ఇతర రైతు సంఘాల నాయకులు

రైతు శ్రేయస్సుకు పరితపించే వ్యక్తి వడ్డే

- ప్రముఖ సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి
- ప్రభుత్వ పథకాలు, ప్రాధాన్యతల్లో సవరణలపై శోభనాద్రీశ్వరరావు రాసిన పుస్తకం ఆవిష్కరణ

విజయవాడ (గాంధీనగర్), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నిరంతరం రైతు, ప్రజల శ్రేయస్సు కోసం పరితపించే గొప్ప వ్యక్తి మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అని ప్రముఖ సినీ నటుడు, దర్శక, నిర్మాత ఆర్.నారాయణమూర్తి పేర్కొన్నారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు రచించిన 'రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో.. ప్రాధాన్యతల్లో సవరణల ఆవశ్యకతపై సీఎం చంద్రబాబుకు వడ్డే బహిరంగ లేఖ' పుస్తకావిష్కరణ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగింది. ఈ పుస్తకాన్ని ఆవిష్కరించిన నారాయణమూర్తి మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధి, రైతు, ప్రజలకు మంచి చేసేందుకు అనేక సూచనలు ఈ పుస్తకంలో వడ్డే పేర్కొన్నారని, వీటిని రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఈ పుస్తకాన్ని సీఎం చంద్రబాబుతో సహా మంత్రులు, ప్రజాప్రతినిధులు చదవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకించాలని సీఎం, డిప్యూటీ సీఎంలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతో సహా అన్ని రాజకీయ పార్టీలను ఆయన కోరారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, విధానపరమైన నిర్ణయాల్లో ప్రభుత్వం ఆలోచన సరళి మారాల్సిన అవశ్యకత ఉందన్నారు. గోదావరి, బనకచర్ల ప్రాజెక్టుకు వేలాది కోట్లు ఖర్చు చేయడం కన్నా కేవలం రెండు వందల కోట్లు రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఖర్చు చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాయలసీమ ప్రాజెక్టుల సాధన సమితి నాయకుడు బొజ్జల దశరథరామిరెడ్డి, రైతు సంఘం నేతలు వై.కేశవరావు, సింహాద్రీ ఝాన్సీ డి.హరినాథ్, పి.జలమయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

ప్రజల సంక్షేమమే కూటమి లక్ష్యం : రావి

నందివాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. సుమారు రూ.43 లక్షలతో జనార్ధనపురంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం ఉదయం రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు వెనిగండ్ల రామకృష్ణ, పార్టీ నాయకులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే అభివృద్ధికి దూరమైన గ్రామాల్లో కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు జరిగాయన్నారు. ఎంపీడీవో మల్లీశ్వరి, ఈవోపీఆర్డీ అమీర్ బాషా, వీఆర్వో శేఖర్, పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న రావి వెంకటేశ్వరరావు

పారిశుధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టాలి

● కలెక్టర్ డీకే.బాలాజీ

కూచిపూడి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డీకే.బాలాజీ అధికారులను ఆదేశించారు. మొవ్వలో కొనసాగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులపై సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థపై అసహనం వ్యక్తం చేశారు. రోడ్లపై డ్రెయిన్లు నిర్మించిన చోట యుద్ధప్రాతిపదికన వాటిని తొలగించాలన్నారు. బస్టాండ్ వెనుక బజారు, ఇండియన్ బ్యాంక్ రోడ్డు, యాదవుల బజారులో ఉన్న డ్రెయిన్లను ఆయన పరిశీలించారు. రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తుండటంపై అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి డ్రెయిన్ల అభివృద్ధి, రహదారులు తదితర అంశాలపై చర్చించారు. తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రెండింటిని కలపి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఈవో సోమేశ్వరరావును ఆదేశించారు. యాదవుల బజారులో చెరువు చుట్టూ ఆక్రమణలు ఉన్నాయని, వాటిని తొలగించాల్సిందిగా గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో ఉన్న రొయ్యల ఫ్యాక్టరీ వ్యర్థాలను డంపింగ్ యార్డుకు చేర్చటం



రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీటిని పరిశీలిస్తున్న బాలాజీ

వల్ల దుర్గంధం వెదజల్లుతుందని గ్రామస్థులు కలెక్టర్‌కు తెలియజేశారు. సంపద తయారీ కేంద్రాలకు చెత్తను తరలించకుండా ప్రధాన రహదారుల పక్కన చెత్త వేసే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే మొవ్వ, కూచిపూడి ప్రధాన రహదారిలో ఉన్న హోలీ స్పిరిట్ పాఠశాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు



సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ బాలాజీ

చేయాలన్నారు. గ్రామాభివృద్ధి, పరిష్కరించాల్సిన సమస్యలు, డ్రెయిన్లు తదితర అంశాలపై చర్చించేందుకు సంబంధిత అధికారులు తన కార్యాలయానికి రావాల్సిందిగా ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సత్యనారాయణ, ఏఈ ప్రసాద్, గ్రామపంచాయతీ కార్యదర్శి సోమేశ్వరరావు, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు పాల్గొన్నారు.



బోనస్ చెక్కులను అందజేస్తున్న బాబూరావు, నగేష్‌లు

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సంక్షేమమే ధ్యేయమని కృష్ణా మిల్క్‌యూనియన్ డైరెక్టర్లు వల్లభనేని భాస్కర కుటుంబ వెంకట సుబ్బారావు(బాబూరావు), అర్జా నగేష్‌లు పేర్కొన్నారు. గుడ్లవల్లేరు పాలశీతల కేంద్రంలో పాడి రైతులకు మూడో విడత బోనస్ చెక్కులను గుడ్లవల్లేరు క్లస్టర్ పరిధిలోని సంఘాల అధ్యక్షులకు సోమవారం పంపిణీ చేశారు. కృష్ణా మిల్క్‌యూనియన్‌కు పాలు పోసే పాడి రైతులకు 2024-25 సంవత్సరాలకి గాను మూడవవిడత గుడ్లవల్లేరు క్లస్టర్ పరిధిలోని 91 సంఘాలకు రూ 97.66 లక్షల బోనస్‌ను ఆయా సంఘ అధ్యక్షులకు వారు అందజేశారు. ట్రస్ట్ సభ్యులు కాగిత జయరాం, ఫీడ్ సభ్యులు మోతుకూరి వెంకటేశ్వరరావు, గుడ్లవల్లేరు పాల శీతలకేంద్రం మేనేజరు తోట సత్యనారాయణ, సూపర్‌వైజర్లు బసవరాజు, వరప్రసాద్, సంఘ అధ్యక్షులు, వేతన కార్యదర్శులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉచిత వైద్యశిబిరం

గుడివాడ : స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తారకరామ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు మెరుగుమాల బ్రహ్మయ్య ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులకు సోమవారం స్టార్ డయాగ్నోస్టిక్స్ వారిచే రక్తపోటు, మధుమేహం రక్త పరీక్షలను నిర్వహించారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ సనకా సుబ్బారావు, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి చిన్నం గంగాధరరావు, తెలుగు మహిళ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు యార్లగడ్డ సుధారాణి, వీరమాచినేని శైలజ, జోన్ చైర్మన్ ఎస్.ఎం అలీ, కొల్లిపర సాయి సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, పిన్నమనేని వేణుగోపాలరావు, సాయన గాంధీ, ఫరీష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకోటేశ్వరరావు

సమస్యల పరిష్కారమే లక్ష్యం

గుడివాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మీకోసం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుందని, సమస్యలు వెంటనే పరిష్కరించటానికి చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మీ కోసం కార్యక్రమం కింద రెండు దరఖాస్తులు వచ్చాయన్నారు. చౌటపల్లిలో కుల ధ్రువీకరణ పత్రం గురించి, గుడివాడలో కుల ధ్రువీకరణ సరి చేయాలని దరఖాస్తు చేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



టీడీపీ సభ్యత్వకార్డులు అందజేస్తున్న శివప్రసాద్

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

గుడ్లవల్లేరు : టీడీపీ కార్యకర్తల, నాయకుల సభ్యత్వ గుర్తింపు కార్డులను సోమవారం డోకిపర్రులో పంపిణీ చేశారు. కార్డులను డోకిపర్రు గ్రామ టీడీపీ అధ్యక్షులు వీరమాచినేని శివప్రసాద్ చేతులమీదుగా పంపిణీచేశారు. బూత్ ఇంచార్జ్ జానీ పాల్గొన్నారు.



రాజాకు పార్టీ కండువ కప్పుతున్న ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్

జనసేనలో చేరిన కొలుసు రాజా

గుడివాడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) : సోమవారం స్థానిక సత్యనారాయణపురంలోని జనసేన నియోజకవర్గ కార్యాలయంలో బీసీ నాయకులు కొలుసు రాజా జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మజ్జి శ్రీనివాస్, నాయకులు సాయన రాజేష్, వినోద్, సుంకర వెంకట్, గుండు వెంకట్రావు, షేక్ మీరాషరీఫ్, పడాల పూర్ణ, దుర్గారావు, సాయికృష్ణ, మహేష్, సౌమ్య, కళ్యాణి, దుర్గ పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి విగ్రహ ప్రతిష్ఠ

గుడివాడ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండలం దొండపాడులో నూతనంగా కోదండ రామస్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. త్రిదండి దేవనాద రామానుజ జీయర్ స్వామిజీ శిష్య బృందం, అర్చక స్వాములు, వేద పండితుల నడుమ హనుమత్ లక్ష్మణ సీతాసమేత కోదండ రామస్వామి ధ్వజస్తంభ, విమాన శిఖర ప్రతిష్ఠ, కళావాహన దర్శనం, మహాపూర్ణాహుతి, వేద ఆశీర్వచనం, స్వామివారి శాంతి కళ్యాణ మహోత్సవం, అత్యంత వైభవంగా ఇర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, స్వర్ణయంత్ర స్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ఆలయ భక్తబృందం, గ్రామ పెద్దల చేత అన్ని రకాల పూజలు నిర్వహింపజేశారు. అనంతరం అన్నదానం చేశారు. పెద్ద పెద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేసి, భక్తులు తిలకించటానికి ప్రత్యేక స్ర్కీన్లు , అన్ని రకాల వసతులు ఏర్పాటు చేశారు. దేవనాద రామానుజ జీయర్



ప్రతిష్ఠాపనలో పాల్గొన్న దేవనాద రామానుజ జీయర్ స్వామిజీ

స్వామిజీ అనుగ్రహ భాషణ భక్తులకు ప్రవచనం చెప్పారు. అర్చకులు, వేదపండితులు మంగళవాయిద్యాల నడుమ స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు విగ్రహప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. ఇతర గ్రామాలనుంచి ఆగ్రామ ఆడపచుడులు దేశ, విదేశాల నుంచి తరలి రావటంతో దొండపాడు గ్రామం భక్తులతో కిటకిటలాడింది.

రైల్వే గేటు విస్తరణ చేపట్టాలని వినతి

గుడివాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కేటీఆర్ కళాశాల వద్ద గల రైల్వేగేటు, పట్టణంలోని చింతల కాలువకు ఇరువైపులా విస్తరణ చేపట్టాలని భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు వై.వి. మురళీకృష్ణ కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కమిషనర్ బి.శ్రీనివాసరావుకు ప్రజల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీఆర్ కళాశాల గేటును 10మీటర్ల మేర వెడల్పు చేయాలన్నారు. పామర్రురోడ్డు పెద్దకాలువ సెంటర్ నుంచి మందపాడు వరకు సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా వాహనాలు వెళ్లడానికి అనుకూలంగా రహదారి మధ్యలో డివైడర్లను ఏర్పాటు చేయాలన్నారు. కవిరాజ కళా భవనం నుంచి చింతల కాలువకు ఇరువైపులా రహదారి అంచుల వరకు విస్తరించి వన్‌వే చేయలన్నారు. స్థానిక ఐఎంఏ హాల్



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న వై.వి. మురళీకృష్ణ

రోడ్డును బాగు చేయాలని, రహదారిపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవిష్యత్ భద్రతా దళం సభ్యులు ఎం.దుర్గారావు, జి.పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో సంతకాలు ఫోర్జరీ చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలి

ఉయ్యూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్వో) సంతకాలు ఫోర్జరీ చేసి ప్రభుత్వ స్థలాల రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతీపత్రం అందజేశారు. స్థలాల ధ్రువీకరణ పత్రాలమీద సంతకాలు వీఆర్వోలవి కావని ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టు ఇచ్చిందన్నారు. దీనిపై 3.06.2021న పమిడిముక్కల పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదుమేరకు ఎఫ్ఐఆర్ నమోదైనట్టు తెలిపారు. సంతకాలు ఫోర్జరీ చేసిన వారిపై జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తగు చర్యలు తీసుకోవాలని ఆయన వినతిపత్రంలో కోరారు.

ఉపాధి పనులు ప్రారంభం

పెదపారుపూడి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడిలో సోమవారం నుంచి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను ఆ గ్రామ సర్పంచ్ చప్పిడి సమీరా ప్రారంభించారు. ఉపాధి పనుల్లో భాగంగా సుమారు 270 మంది కూలీలతో గ్రామంలో ఐదు ప్రాంతాల్లో పనులు చేపట్టామని ఫీల్డ్ అసిస్టెంట్ రవి తెలిపారు.

లయన్స్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్‌గా కొండపల్లి చంద్రశేఖర్‌రెడ్డి

గుడివాడ : తెలంగాణ రాష్ట్రం, సికింద్రాబాద్‌లోని మద్దూరి కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సమావేశంలో గుడివాడ నియోజకవర్గం, నందివాడకు చెందిన కొండపల్లి చంద్రశేఖర్‌రెడ్డి లయన్స్ ఇంటర్నేషనల్ 320హెచ్ జోన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. గవర్నర్ గంపా నాగేశ్వరరావు సమక్షంలో ఆయన ప్రమాణస్వీకారం చేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్‌గా ఎంపికైన కొండపల్లిని ఎన్‌జీవోస్ అసోసియేషన్ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నందివాడ మండల ప్రముఖులు అభినందించారు.

పూడికతీత పనులను వెంటనే చేపట్టాలి

● రైతు సంఘం నేత ఉమామహేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

గుడివాడ, ఏప్రిల్ 07(ఆంధ్రజ్యోతి) : మిచ్హాంగ్ తుఫాన్ సమయంలో చంద్రయ్య కాలువ దుస్థితి, పంటనష్టాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు తెలియజేశామని, అధికారంలోకి రాగానే పూడికతీతపై దృష్టిపెడతానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రైతు సంఘం నాయకులు శొంఠి ఉమామహేశ్వరరావు కోరారు. సోమవారం స్థానిక బేతవోలులోని బోయిన అగ్రయ్య భవన్‌లో రైతు సంఘం గుడివాడ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో బేతవోలు రైతులు, కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయ్య కాలువపై పోలుకొండ వద్ద 8 షట్టర్లు ఉన్నాయని, వాటిలో రెండు షట్టర్లకు మరమ్మతులు చేపట్టాల్సి ఉందన్నారు. షట్టర్లకు మరమ్మతులు చేపట్టకపోవడం వల్లే పంటనష్టం జరిగిందని వివరించారు. చంద్రయ్య కాలువ పూడికతీక పనులను చేపట్టాలన్నారు. గుర్రపుడెక్క, తూడుకాడ, మలుపుల్లో ఉన్న దిబ్బలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు మురళీకృష్ణారెడ్డి, రైతులు పొలగాని ప్రకాశరావు, భోగాది నాగేశ్వరరావు, బోయిన ప్రభాకరరావు, ఎస్.శ్రీనివాసులు, రామచంద్రరావు, పున్నయ్య, రమణ, వీరయోగి, భాను, భైరాగి, వైష్ణవి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

పెదపారుపూడి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీతో కూడిన వ్యక్తిగత బ్యాంక్ రుణాల కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యలమర్రు, భూషణగుళ్ల , ఇండియన్ బ్యాంక్ పెదపారుపూడి బ్రాంచ్‌ల పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారి ధృవపత్రాలను పరిశీలించి, దరఖాస్తు చేసుకున్న యూనిట్స్‌పై ఇంటర్వ్యూలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించినట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ఈ బ్రాంచ్‌ల పరిధిలోని యలమర్రు, చినపారుపూడి, అప్పికట్ల, జువ్వనపూడి, పెదపారుపూడి, మహేశ్వరపురం, భూషణగుళ్ల, గుర్విందగుంట, జమీదింటకుర్రు, ఈదులమద్దాలి గ్రామాల నుంచి 170 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాస్, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో, బ్యాంక్ సిబ్బంది

పాల్గొన్నారు. రేపు దోసపాడు, వెంట్రప్రగడ బ్యాంక్‌ల పరిధిలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు స్ర్కూటినీ , ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు.

రాములోరి ఆలయాల్లో అన్నసమారాధనలు



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పామర్రు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్దగల వీరాంజనేయస్వామి దేవస్థానం వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం మహా అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్నసమారాధనను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్‌తో కలసి ప్రారంభించారు. తొలుత శ్రీవీరాంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజాదికాలు జరిపించుకున్నారు. ఆలయ ఉత్సవకమిటి సభ్యులుతాడిశెట్టివేంకటేశ్వరరావు,వెన్నాశ్రీనివాసరావు,మట్టావెంకటేశ్వరరావు కార్యనిర్వహణాధికారి ప్రసాదరావులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి నూతన వస్త్రాలను ఎమ్మెల్యేకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాడెల్టా ప్రాజెక్టుకమిటి వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, ఈడే ఘంటేశ్వరరావు, ఎంపీటీసీ కూనపరెడ్డి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, గుంప గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : సీతారాముల వారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆర్యవైశ్య కారర్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్ ఆకాంక్షించారు. సోమవారం స్థానిక ఏలూరురోడ్డులోని గాంధీ బొమ్మ వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించిన సందర్భంగా అన్నప్రసాద కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పెద్దమల్లు వెంకటేశ్వరరావు, కొత్త మురళీకృష్ణారావు, నేరెళ్ల సురేష్‌కుమార్, పెద్దమల్లు పద్మావతి, తిరివీధుల వెంకట సుబ్బారావు, కొత్త సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నందివాడ: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పోలుకొండలో మంచినీటి చెరువు వద్ద గల రామాలయంలో సుమారు 2 వేల మందికి అన్నసమారాధన చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా పూజా కార్యక్రమాలు దేవుని ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. రెండో రోజు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కమిటీ పెద్దలు తెలిపారు. ఈ అన్నసమారాధన కార్యక్రమంలో పోలుకొండ గ్రామస్తులే కాకుండా చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుడివాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గుడివాడ రైల్వేస్టేషన్ పరిధిలోని మోటూరు రైల్వే గేటు సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే ఎస్సై మహబూబ్ షరీఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుని వయస్సు 25 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతుని కుడి భుజంపై పి.తేజ 2013 అని, కుడిచేతి వద్ద దుర్గ, ఎడమ చేతి వద్ద పి.ఎస్.ఆర్ అని పచ్చబొట్లు ఉన్నాయన్నారు. తెలుపు, గోధుమ రంగు గళ్ళ చొక్కా, బ్లూ రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు స్థానిక ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సెల్ నెం. 98662 21412, 99890 29379కు సంప్రదించాలని ఎస్సై షరీఫ్ తెలిపారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు

కూచిపూడి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సెకండ్ ఇంటర్ విద్యార్థులకు నోటు పుస్తకాలు, టెక్స్ట్ పుస్తకాలు, రికార్డులను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరబోవు విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్టు ప్రిన్సిపల్ ప్రసాద శాస్త్రి తెలిపారు. పది పరీక్షలు రాసిన విద్యార్థులు ముందుగా సీట్లు రిజర్వ్ చేసుకుని బ్రిడ్జి కోర్సులకు హాజరుకావాలన్నారు. తమ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీతో పాటు ఒకేషనల్ కోర్సులైన ఏఎంటి, ఓఏఎస్, ఎంఅండ్ఏటీ గ్రూపులు ఉన్నట్టు ప్రిన్సిపల్ తెలిపారు.

శిరీష రిహాబిలిటేషన్ సెంటర్‌లో అన్నదానం

గుడివాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చౌదరిపేటలోని శిరీష రిహాబిలిటేషన్‌కేంద్రంలో శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో సోమవారం ముదినేపల్లి మండలం పేరూరుకు చెందిన సోమ సత్యనారాయణ జన్మదినం సందర్భంగా చిన్నారులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నేత లింగం ప్రసాద్ , సేవాసంఘం సభ్యులు తిరుపతయ్య, రామారావు, సోమ కొండలరావు, తాతారావు, హరిబాబు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

సకాలంలో వినతులను పరిష్కరించాలి: కలెక్టర్



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారులు మీకోసంలో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. సోమవారం మీకోసంలో పెండింగ్‌గా ఉన్న వివిధ శాఖల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతి పత్రాలను కలెక్టర్ స్వీకరించారు. మెప్మా పీడీ సాయిబాబు అర్జీలు స్వీకరించారు. కాగా దివ్యాంగులకు లాప్‌టాప్‌లను అందజేశారు. శిశుగృహాల నుంచి పిల్లలను దత్తత తీసుకున్న దంపతులకు పిల్లలను అప్పగించారు.

వైభవంగా శ్రీరామపట్టాభిషేకం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం బందరుకోట కోదండ రామాలయంలో జరిగిన నారాయణ హోమం ముగిసిన సందర్భంగా జరిగిన పూర్ణాహుతిలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆయన కుమారుడు పునీత్‌తోపాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. సీతారామ లక్ష్మణుల విగ్రహాలను వైభవంగా అలంకరించారు. సహస్ర నామాలతో స్వామివారికి, అమ్మవారికి అర్చనలు జరిపారు. మాజీ కౌన్సిలర్ బచ్చుల అనిల్‌కుమార్, జిల్లా మత్స్యకారుల సంఘ అధ్యక్షుడు కొక్కిలిగడ్డ నాగరమేష్, కరగ్రహారం మాజీ సర్పంచ్ నాగుల్‌మీరా పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

స్థానిక బచ్చుపేటలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈవో సమ్మెట ఆంజనేయ స్వామి ఉత్సవాలను ప్రారంభించారు.

భావదేవరపల్లిలో శ్రీరామపట్టాభిషేకం

నాగాయలంక: ధర్మ పరిరక్షణకు పాటుపడటమే శ్రీరామ పట్టాభిషేకం పరమార్థమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం నాగాయలంక మండలంలోని భావదేవరపల్లిలో శ్రీరామాలయంలో రాముల వారి పట్టాభిషేక మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తాత మండలి వెంకట్రామయ్య ఆధ్యాత్మిక వారసత్వాన్ని తమ్ముడు ఉదయభాస్కర్ కొనసాగిస్తూ శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, ఈ ఏడాది పట్టాభిషేకంలో పాల్గొనటం ఆనందదాయకమన్నారు. మండలి బుద్ధప్రసాద్ సోదరుడు మండలి సత్యప్రసాద్, జనసేన నేతల మండలి వెంకట్రామ్ రాముల వారి ఊరేగింపు సందర్భంగా పల్లకీ సేవ చేశారు. సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ - స్వర్ణ దంపతులు, మండలి వెంకట్రామ్ - కృష్ణవేణి దంపతులు, వెంకట కాళేశ్వరరావు - విజయలక్ష్మి దంపతులు పాల్గొని పట్టాభిషేకం జరిపించారు. అనంతరం అచ్చిరెడ్డి ముఠా, కృష్ణారెడ్డి ముఠా, బండ్రెడ్డి ముఠా, బావిరెడ్డి ముఠా పర్యవేక్షణలో జరిగిన భారీ అన్నసమారాధనను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు.



పూర్ణాహుతిలో పాల్గొన్న మంత్రి రవీంద్ర



శ్రీరాముడి పట్టాభిషేకంలో పాల్గొన్న మండలి కుటుంబం



స్వామివారి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు



రామాలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాగిత

వి.రుద్రవరం గ్రామంలో..

ఘంటసాల,: మండల పరిధిలోని వి.రుద్రవరం గ్రామంలోని రామాలయం వద్ద సీతారాముల పట్టాభిషేక మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ వెనిగళ్ల రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి పట్టాభిషేక మహోత్సవ ఊరేగింపునకు సంబంధించి బండి పాటను రూ.31,011కు వేలంపాటలో పాడినట్టు తెలిపారు. సర్పంచ్ రామకృష్ణ ప్రసాద్, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో సీతారాముల ఉత్సవమూర్తులతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది.

రామాలయానికి ఎమ్మెల్యే కాగిత శంకుస్థాపన

పెడన రూరల్: మండలంలోని బల్లిపర్రు శివారు గ్రామమైన శింగరాయపాలెంలో నూతన రామాలయ నిర్మాణంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొని పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. కాలనీలో ఏర్పాటు చేయనున్న రామాలయానికి గ్రామస్థుల సహకారంతో నిర్మిస్తున్నారు. సర్పంచి జోగి నాగ వరలక్ష్మి, జడ్పీటీసీ అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, జోగి వెంకటరమణ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భారీగా అన్న సమారాధన

అవనిగడ్డ రూరల్: మండల పరిధిలోని అశ్వారావుపాలెంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. దాదాపు 4వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే వేకనూరు శివారు గుడివాకవారిపాలెంలో అన్నసమారాధన నిర్వహించగా, 1500 మంది భక్తులు పాల్గొన్నారు. కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.





మచిలీపట్నంలో జరిగిన ర్యాలీలో మత పెద్దలతో పాటు కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ నేతలు, చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

వక్ఫ్ బిల్లు వెనక్కి తీసుకోవాలి

● ముస్లిం సోదరుల భారీ ర్యాలీ, పాల్గొన్న మహిళలు ● వివిధ రాజకీయ పార్టీల నేతల మద్దతు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ, రాజ్యసభల్లో ఆమోదించిన వక్ఫ్ ఎమెండ్‌మెంట్ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సోమవారం మచిలీపట్నంలో ముస్లిం సమైక్య వేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రాజుపేట షాదీఖానా నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ కోనేరుసెంటర్ వరకు సాగింది. అనంతరం కోనేరు సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని లెక్క చేయకుండా వక్ఫ్ ఎమెండ్‌బిల్లును పాస్ చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ అబ్దుల్ మతీన్, వైసీపీ నేత షేక్ సిలార్‌దాదా, వైసీపీ కార్పొరేటర్లు, టీడీపీ నేతలు ఖాజా, బాజానీతో పాటు సీపీఐ నేత లింగం ఫిలిప్, జనసేన నేతలు ర్యాలీలో పాల్గొన్నారు. ప్ల కార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. అనంతరం కోనేరుసెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు వెళ్లి కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం సమర్పించారు.

చల్లపల్లిలో నిరసన ర్యాలీ

చల్లపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా చల్లపల్లిలో ముస్లింలు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. సోమవారం ఉదయం స్థానిక పెద్దమసీదు వద్ద ర్యాలీ ప్రారంభమై ప్రధాన సెంటరు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు చేరుకుని తిరిగి మసీదు వరకు సాగింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి, తహసీల్దార్ డి.వనజాక్షికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ నసీం షోరి మాట్లాడుతూ కేంద్రం అమలు చేయాలని చూస్తున్న వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింల మనోభావాలు దెబ్బతీసేదిగా ఉందన్నారు. ముస్లిం ప్రముఖులు షేక్ అబ్బు షరీఫ్, మీర్ రిజ్వాన్, మగబుల్ సాబ్, అలీం రజా, అబ్దుల్ కమాల్, అన్వర్ భాష, మహమ్మద్ కరీముల్లా, అర్షద్, రౌఫ్, గయాజ్, ఇబ్రహీం, అమీద్, కరీముల్లాఖాన్, షేక్ సిలార్‌లతోపాటు పెద్దసంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

నైట్‌బీట్‌లు పెంచుతున్నాం

● అదనంగా పోలీసు అధికారులతో పెట్రోలింగ్ ● బందరు డీఎస్పీ సీహెచ్ రాజా

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో రాత్రిపూట చిన్న చిన్న దొంగతనాలు జరుగుతున్న దృష్ట్యా నైట్‌బీట్‌లు పెంచుతున్నట్టు బందరు డీఎస్పీ సీహెచ్ రాజా తెలిపారు. రాత్రిపూట అధికంగా దొంగలు తిరుగుతున్న సమస్యపై డీఎస్పీని ఆంధ్రజ్యోతి పలుకరించింది. దీనిపై డీఎస్పీ స్పందించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని నగరంలో అదనంగా రెండు నైట్‌బీట్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ నైట్‌బీట్లను పరిశీలించేందుకు మరో ఇద్దరు పోలీసు అధికారులతో పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.కళాశాలల వద్ద బాలికలపై వేధింపు చర్యలను అరికడుతున్నామన్నారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించాక ఆయా విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

విజయవాడలో పీజీ సెంటర్ ఏర్పాటు చేయండి

● సీఎం చంద్రబాబుకు కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి వినతి



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణావిశ్వవిద్యాలయం పీజీ సెంటర్‌ను విజయవాడలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి వినతిపత్రం సమర్పించినట్టు కేయూ వీసీ కే రాంజీ తెలిపారు. సోమవారం ఆయన వర్సిటీలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసినప్పుడు వర్సిటీలో జరుగుతున్న భవనాల నిర్మాణాలపై మాట్లాడామన్నారు. కావలసిన నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. అలాగే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించామన్నారు. సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. కాగా నూజివీడు పీజీ సెంటర్ ఏలూరు జిల్లాలో ఉన్న నేపథ్యంలో కృష్ణావిశ్వవిద్యాలయం పరిధిలో ఎక్కువ కళాశాలలకు కేంద్రమైన విజయవాడలో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలన్న వీసీ వినతికి పలువురు కళాశాలల ప్రిన్సిపాల్స్ సానుకూలంగా స్పందించడం విశేషం.

మద్యం మత్తులో వెల్డింగ్ వర్కర్ ఆత్మహత్య

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బందరు మండలం పల్లెతాళ్లపాలెం గ్రామంలో మద్యం మత్తులో ఉండి ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతమిది. రూరల్ ఎస్ఐ సత్యనారాయణ అందించిన వివరాలిలా ఉన్నాయి. బందరు మండలం పల్లెతాళ్లపాలెం గ్రామానికి చెందిన చక్కా నాగబాబు (23) హైదరాబాద్‌లో వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శ్రీరామనవమి పండుగకు వచ్చిన నాగబాబు మద్యానికి బానిసై తల్లిని మద్యం కోసం డబ్బులడిగి ఇవ్వకపోవడంతో చితకబాదాడు. ఆమె బంధువుల ఇంటికి వెళ్లగా ఆదివారం రాత్రి ఉరేసుకుని మృతి చెందాడు. తండ్రి ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

బీసీ రుణాలకు 3,900 దరఖాస్తులు.. 1484 దరఖాస్తుల పరిశీలన

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలపై నగరంలో 3,900 మంది దరఖాస్తు చేసుకున్నారు. బీసీ కార్పొరేషన్ 191 యూనిట్లకు మాత్రమే సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయగా 50 డివిజన్ల నుంచి 3,900 మంది దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం టౌన్‌హాలులో మొదటి రోజు 1 నుంచి 26 డివిజన్ల సచివాలయాల పరిధిలో 1958 మంది అర్జీదారులకు 1484 మంది తమ అర్జీదారుల దరఖాస్తులను పరిశీలించారు. 2వ రోజు మంగళవారం మిగిలిన 27 నుంచి 50 డివిజన్ల పరిధిలో దరఖాస్తు చేసుకున్న అర్జీదారులు హాజరు కావాల్సి ఉంది. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, కెనరా బ్యాంకుకు చెందిన మేనేజర్లు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

వాహనాలపైకి దూసుకెళ్లిన ఇసుక ట్రాక్టర్

ఐదుగురికి తీవ్ర గాయాలు.. ఇద్దరికి స్వల్ప గాయాలు

మోపిదేవి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది కరకట్ట రహదారి వెంబడి ఉన్న సిమెంట్ బల్లలు, తాటిపట్టెలపై కూర్చున్న వ్యక్తులు, ద్విచక్ర వాహనాలపైకి వేగంగా ఇసుక ట్రాక్టర్ దూసుకుని రావటంతో ఏడుగురికి గాయాలైన ఘటన మోపిదేవి మండలంలోని కె.కొత్తపాలెం వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగింది. ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులతో వర్క్ ఫ్రమ్ సర్వే చేస్తున్నారు. కె.కొత్తపాలెం గ్రామ సచివాలయ ఉద్యోగులు కరకట్ట దిగువనున్న పలు కుటుంబాల సర్వే నిమిత్తం వెళ్లారు. గ్రామస్థులు మధ్యాహ్నం చెట్ల కింద సేద తీరుతూ కూర్చున్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం వైపు నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ వేగంగా వెళ్తూ అదుపు తప్పి కరకట్టపై ఉన్న గ్రామస్థుల వాహనాలు, చెట్ల కింద కూర్చున్న వ్యక్తులను ఢీకొట్టి దిగువకు వెళ్లింది. ఈ ఘటనలో పడమటి నాగరాజు, పడమటి రాఘవేంద్రరావు, పడమటి మాణిక్యాలరావు, పడమటి రాధాకృష్ణ, పడమటి ఫణీంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. మల్లవోలు నాగ అశోక్, పడమటి నాగరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్థులు సమాచారంతో 108 అంబులెన్స్‌లో గాయాలపాలైన ఏడుగురు వ్యక్తులను అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం తీవ్రంగా గాయాలైన ఐదుగురిని మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మోపిదేవి ఎస్ఐ వైవి.సత్యనారాయణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.



రంగారావును పరామర్శిస్తున్న మంత్రి సత్యకుమార్

రంగారావును పరామర్శించిన మంత్రి సత్యకుమార్

ఘంటసాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కొడాలి గ్రామానికి చెందిన తుమ్మల రాజేంద్రరావు ఇటీవల మృతి చెందగా, ఆయన కుమారుడు రంగారావును మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ సోమవారం రాత్రి పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకుని, రాజేంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబసభ్యులకు సంతాపం తెలియజేశారు. జనసేన నేతలు మండలి వెంకట్రామ్, బీజేపీ నేతలు లంక దినకర్, టీడీపీ మండలాధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, నేతలు పరుచూరి సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌కు 113 మంది విద్యార్థుల హాజరు

పెడన రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జేఈఈ మెయిన్స్ 2025కు జరిగిన పరీక్షల్లో 119 విద్యార్థులకు గాను 113 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షలో 57 మంది విద్యార్థులకు 54 మంది, మధ్యాహ్నం 62 మందికి 59 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

జింజేరు గ్రామానికి చెందిన పడమట మాణిక్యాలరావు అనారోగ్యానికి గురికావటంతో ఎమ్మె ల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.37,292 చెక్కును ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అందించారు. శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్ పాల్గొన్నారు.

600 మందికి ఇంటర్వ్యూలు

పేదల ఆర్థిక విధానం మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేస్తోందని ఇన్‌చార్జి ఎంపీడీవో సీహెచ్ వెంకటేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ అధికారులతో కలిసి దరఖాస్తు చేసుకున్న 600 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. బ్యాంకు మేనేజర్లు అధికారులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

పెడన, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లిపర్రులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై డీఎస్పీ సీహెచ్ రాజా ఆదివారం అర్ధరాత్రి తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో 9 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.36,650 నగదు, 6 మోటారు బైక్‌లు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ రామకృష్ణయ్య, సూపరింటెండెంట్ ఆశాలత, పలువురు వైద్యులు పాల్గొని ప్రసంగించారు. ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.

వాడవాడలా భగవద్గీత పారాయణ

● మంత్రి రవీంద్రను కలిసిన కర్నూలు భక్తుడు కృష్ణుడు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు టీడీపీ అధికారంలోకి రావాలని జిల్లా ప్రధాన కేంద్రాల్లో భగవద్గీత పారాయణ చేసిన కర్నూలు భక్తుడు కృష్ణుడు సోమవారం మంత్రి కొల్లు రవీంద్రను కలిశారు. బందరుకోటలో జరుగుతున్న సీతారాముల కల్యాణ ఉత్సవాల్లో కొల్లు రవీంద్రను కలిసి అభినందనలు తెలిపారు. మాజీ కౌన్సిలర్ అనిల్‌కుమార్ ఉన్నారు.

జై ఆంధ్ర ఉద్యమకారుడు చలమలశెట్టి కన్నుమూత

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చిలంకుర్తి అంబులు బంధువు, జై ఆంధ్ర ఉద్యమకారుడు చలమలశెట్టి చంచలరావు సోమవారం కన్నుమూశారు. కొద్దిరోజులుగా చంచలరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. చంచలరావు మృతికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

గూడూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని కప్పలదొడ్డి గ్రామంలో సర్పంచ్ యక్కల మాధవి పనులను ప్రారంభించారు. ఎంపీటీసీ పేరిశెట్టి తేజోవతి, పంచాయతీ మెంబర్లు యక్కల నాగరాజ్, గ్రామ మాజీ సర్పంచ్ కట్టా మునీశ్వరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పాల సంఘాలకు బోనస్ పంపిణీ

పెడన: గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోని 91 పాల సంఘాలకు సోమవారం బోనస్ పంపిణీ జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 3వ విడతకు సంబంధించిన 4నెలల బోనస్ రూ. 97 లక్షల 66వేల 813లు చెక్కుల రూపంలో 91 పాల సంఘాల అధ్యక్షులకు పంపిణీ చేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్లు అర్జా వెంకట నగేష్, వల్లభనేని భాస్కర వెంకట సుబ్బారావు, గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సూపర్‌వైజర్ బసవరాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చింతకోళ్ల వాసులకు తాగునీరు



కోడూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం కోడూరు మండలం చింతకోళ్ల గ్రామస్థులకు వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీరు అందించారు. నియోజకవర్గంలోని తీర ప్రాంత గ్రామాల ప్రజలకు వేసవిలో ఎలాంటి తాగునీటి ఇబ్బంది రాకుండా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తున్నారు. సోమవారం చింతకోళ్ల గ్రామ ప్రజలకు 20 వేల లీటర్ల తాగునీరు అందించారు. వెంకట్రామ్ తాగునీటి సరఫరాను పర్యవేక్షించారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



కోడూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయం వద్ద బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి అర్జీదారులకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుధాప్రవీణ్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 168 మంది హాజరైనట్టు ఎంపీడీవో తెలిపారు. స్టేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు విచ్చేసి స్వయంగా అర్జీదారుల ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మంగళవారం కూడా ఇంటర్వ్యూలు కొనసాగుతాయన్నారు.

పృథ్వీశ్వరస్వామి ఆలయానికి భక్తుల తాకిడి

చల్లపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): చారిత్రక ప్రసిద్ధినొందిన నడకుదురు శ్రీపృథ్వీశ్వర క్షేత్రానికి భక్తుల రాక రోజురోజుకీ పెరుగుతోంది. పశ్చిమ అభిముఖంగా ఉన్న ఆలయం, స్వయంభువుగా వెలిసిన శ్రీపృథ్వీశ్వర స్వామి, పాటలీవృక్షాలు క్షేత్రంలో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఇటీవల సూర్యాస్తమయాన సూర్యకిరణాలు నేరుగా స్వామిపై ప్రసరించటాన్ని గుర్తించి ఆ సమయంలో అభిషేకాలు నిర్వహించారు. దీంతో భక్తుల రాక మరింతగా పెరిగింది. సోమవారం పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి తరలిరాగా, అర్చకుడు మామిళ్లపల్లి హేమంత్‌కుమార్ స్వామికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈవో యార్లగడ్డ వాసు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు చేస్తున్నారు.

వేదిక నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఘంటసాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలపార్వతీ సమేత శ్రీ జలధీశ్వరస్వామి దేవాలయంలో రూ.2.80 లక్షల అంచనాలతో అష్టాదశ శక్తిపీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగాల వేదిక నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ విషయంపై స్పందించి పాలడుగు శివశంకరరావు-ఈశ్వరమ్మ దంపతులు తమ తల్లిదండ్రులు పాలడుగు సుబ్బయ్య - లక్ష్మీరత్నం దంపతుల జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళాన్ని కమిటీ నిర్వాహకులు గొర్రెపాటి వెంకట రామకృష్ణకు సోమవారం అందజేశారు. అర్చకులు చావలి కృష్ణకిషోర్‌చే స్వామి, అమ్మవారి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.